

ఎన్నికల ముందు వైసీపీ నాయకులు చెబుతున్న మాట ఒక్కటే.. మీకు ఎవరు మంచి చేశారో వారికే ఓటేయాలని.. మంచి చేయడం ఏమిటి.. ఒక సీఎంగా ప్రజల బాగోగులు చూసుకోవడం ఆయన విధి.. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడమూ ఆయన బాధ్యతే.. ఏ సీఎం వచ్చినా అదే చేస్తారు.. జగన్ పాలనకు ముందు ఫీజు రీయింబర్స్‌మెంట్ లేదా.. ఆరోగ్యశ్రీ లేదా పింఛన్లు లేవా.. పంట నష్టపరిహారాలు లేవా అన్నీ ఉన్నాయి..నాటి పథకాల పేర్లు మార్చి నేడు ప్రచార ఆర్భాటానికి ఆయనే చేసినట్టు చెప్పుకుంటు న్నారు.. మన మాట తప్పని.. మడమ తిప్పని సీఎంగారు.. ఆ పథకాలైనా సక్రమంగా అమలు చేశారా అంటే అదీ లేదు.. ఈ ఏడాది ఎన్నికల ముందు చేస్తూ సుమారు ఐదు పథకాలకు బటన్ నొక్కేశారు కానీ.. నేటికీ రూపాయి పడలేదు.. దీంతో గత రెండు నెలలుగా లబ్ధిదారులు బ్యాంకుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు.. ఈ రోజుకీ బ్యాంకుల ముందు క్యూకడుతూనే ఉన్నారు పాపం జనం..



ఇస్తానంటారు.. ఇవ్వరంతే!

నేను ఐదు ఎకరాలు కౌలు తీసుకుని సాగు చేశా. గత సార్వాలో మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో పంట పూర్తిగా నష్టపోయా. అదే సీజన్‌లో పరిహారం అందుతుందని భావించా. మార్చిలో సీఎం బటన్ నొక్కి నిధులు విడుదల చేశారు. డబ్బులు మాత్రం మా ఖాతాల్లో పడలేదు. **- దువ్వా తాతాజీ, కౌలురైతు, గొల్లప్రోలు**



5 పథకాలకు.. ఈ రోజుకీ..

ఒక్క రూపాయీ జమ కాలేదు!

- బటన్ నొక్కారు.. సొమ్ములు పడలేదు
- ఖాతాల్లో డబ్బులు వేశామంటూ ఆర్భాటం
- ప్రతి సభలోనూ జగన్ ప్రగల్భాలు
- నెలలు గడుస్తున్నా ఎదురుచూపులే
- బ్యాంకులు చుట్టూ లబ్ధిదారుల ప్రదక్షిణ

పిఠాపురం, మే 3: బటన్ నొక్కితే సొమ్ములు నేరుగా మీ ఖాతాల్లోకి పడిపోతున్నాయి.. ఇది జగన్ మాట. నమ్మొద్దు.. అంతా మోసం గురూ ఒక్క రూపాయి పడలేదు.. ఇది లబ్ధిదారుల మాట. సీఎం హోదాలో జగన్ ఎక్కడికి వెళ్లి సభ పెట్టినా, నోటిఫికేషన్ వచ్చిన తర్వాత జరిగిన సిద్ధం సభలు, ప్రస్తుతం జరుగుతున్న ప్రచార సభల్లో చెప్పే మాట ఒక్కటే ..దేశంలో ఎక్కడా లేని విధంగా కోట్లాది రూపాయలను బటన్ నొక్కి నేరుగా మీ ఖాతాల్లో వేస్తున్నాం అని.. వాస్తవంలో మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. రోజులు గడిచిపోయాయి. నెలలు దాటుతున్నాయి. ఈ ఏడాది బటన్ నొక్కినా నిధులు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు చేరలేదు. ఈ ఏడాది జనవరి 1 నుంచి మార్చి 18న ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే వరకూ తొమ్మిది పథకాలకు జగన్ బటన్‌లు నొక్కారు. ఇందులో ఐదు పథకాలకు సంబంధించి నేటి వరకూ ఒక్క రూపాయి లబ్ధిదారుల ఖాతాలకు జమ కాలేదు. ఆసరా నిధులు 50 శాతం మందికి మాత్రమే పడ్డాయి. సీఎం బటన్ నొక్కి మీ ఖాతాలకు సొమ్ములు వేశామని చెప్పడంతో గత రెండు నెలలుగా లబ్ధిదారులు బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అసలు సొమ్ములు విడుదల చేస్తే కదా పడేది అంటూ కొందరు బ్యాంకర్లు సమాధానమిస్తున్నారు. ప్రచారంలో భాగంగా అధికార పార్టీ నాయకులు తాము వివిధ పథకాల కింద సొమ్ములు వేశామని చెబుతుంటే ఖంగుతినడం లబ్ధిదారుల వంతవుతోంది. పలు చోట్ల వైసీపీ నేతలను ప్రజలు ఇదే విషయంపై నిలదీస్తున్నారు.

ఆసరాకు..100 రోజులు

డ్వాక్రా సంఘాలు 2019 ఏప్రిల్ నాటికి తీసుకున్న రుణ మొత్తాలను మాఫీ చేస్తామని ఎన్నికలకు ముందు చెప్పిన జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మడతేశారు. దాన్ని నాలుగు విడతల్లో తీరుస్తామంటూ ప్రకటించి ఏటా కొంత మొత్తంలో నిధులను విడుదల చేయడం ఆరంభించారు. నాలుగో విడతగా నిధులను జనవరి 23న జగన్ విడుదల చేశారు. కాకినాడ జిల్లాలో 37,525 గ్రూపుల్లోని 3,76,071 మంది మహిళలకు రూ.300.74 కోట్లు, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 31,093 సంఘాలకు రూ.254.25 కోట్లు, తూర్పుగోదావరి జిల్లాలో 32,707 సంఘాలకు రూ.276.47 కోట్లు బటన్ నొక్కి విడుదల చేసినట్టు ప్రకటించారు. ఈ మేరకు వైసీపీ నాయకులు సమావేశాలు పెట్టి మహిళలను భారీగా తరలించి ప్రచారం చేశారు. నమూనా చెక్కులు అందించారు. నేటికీ 50 శాతం లబ్ధిదారులకు సొమ్ములు పడలేదు. ఎస్సీ, బీసీ కార్పొరేషన్ల ద్వారా మాత్రమే నిధులు రావడంతో ఆయా వర్గాలకే సొమ్ములు పడినట్టు చెబుతున్నారు. మిగిలిన వారికి 100 రోజులైన్నా సొమ్ములు రాలేదు.

దా..రుణం.. ఏడు నెలలైంది?

బ్యాంకులు, సహకార సంఘాల నుంచి రూ.లక్ష లోపు వ్యవసాయ స్వల్పకాలిక పంట రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో రుణాలను వడ్డీతో సహా తిరిగి చెల్లిస్తే వడ్డీ మొత్తాన్ని రాష్ట్రప్రభుత్వం తిరిగి చెల్లిస్తోంది. ఏటా అక్టోబర్‌లో ఈ నిధులు విడుదల చేసేవారు. ఈ ఏడాది ఫిబ్రవరి 28న బటన్ నొక్కి విడుదల చేశారు. ఐదు నెలలు ఆలస్యంగా నిధులు విడుదల చేసినా లబ్ధిదారులకు అందలేదు. వడ్డీ రాయితీ కాకినాడ జిల్లాలో 34,270 మంది రైతులకు రూ.5.35 కోట్లు, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 35,707 మంది రైతులకు రూ. 5.37 కోట్లు, తూర్పుగోదావరి జిల్లాలో 30,714మందికి రూ5.86 కోట్లు సీఎం జగన్ బటన్ నొక్కి విడుదల చేశారు. రెండు నెలలు దాటినా ఒక్కరికా రూపాయి పడలేదు.

జగనన్న విద్యాదీవెనేది..

వృత్తి విద్యా కోర్సులు, డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు జగనన్న విద్యాదీవెన ద్వారా ప్రభుత్వం ఫీజుల సొమ్మును వాయిదా రూపంలో వారి తల్లుల ఖాతాలకు జమ చేస్తోంది. ఈ ఏడాది మొదటి విడతగా మార్చి 1న కాకినాడ జిల్లాలోని 41, 474 మంది విద్యార్థులకు సంబంధించి 37,196 మంది త ల్లుల ఖాతాలకు రూ.28.84 కోట్లు, అంబేడ్కర్ కోనసీమ జిల్లా లో 33,502 మంది విద్యార్థుల తల్లుల ఖాతాలకు రూ.25.80 కోట్లు, తూర్పుగోదావరి జిల్లాలో 31,926 మంది విద్యార్థులకు రూ.24.09 కోట్లను సీఎం జగన్ బటన్ నొక్కి తల్లుల ఖాతాలకు మళ్లించినట్టు చెప్పారు. ఈ సొమ్ములు తల్లుల ఖాతాలకు చేరలేదు. దీంతో ఎక్కడికక్కడ విద్యా సంస్థలు ఫీజులు చెల్లించాలని ఒత్తిడి తెస్తుండడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలుచోట్ల అప్పులు చేసి ఫీజులు చెల్లిస్తున్న పరిస్థితి నెలకొంది. రెండు నెలలు దాటినా ఇంకా సొమ్ములు పడలేదు.

అన్నదాతకు పరిహారమేది..

సార్వా, రబీ సమయాల్లో ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు అదే సీజన్ ముగిసేలోగా పంట నష్టపరిహారం(ఇన్‌పుట్ సబ్సిడీ) అందిస్తామని జగన్ ప్రగల్భాలు పలికారు. కరవు కారణంగా నష్టపోయిన వారికి పరిహారం ఎగ్గొట్టారు. గతేడాది డిసెంబరులో వచ్చిన మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో సార్వా రైతులు తీవ్రంగా నష్టపోయారు. వారందరికీ సీజన్ ముగిసేలోగా పరిహారం అందిస్తామని ప్రకటించారు. రెండు నెలలు ఆలస్యంగా మార్చి 6న కాకినాడ జిల్లాలో 13,540 హెక్టార్లలో పంటలు నష్టపోయిన 29,370 మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీగా రూ.23.05 కోట్లు, కోనసీమ జిల్లాలో 11,669 హెక్టారలో పంటలు నష్టపోయిన 23,379 మంది రైతులకు రూ.20.25 కోట్లు, తూర్పుగోదావరి జిలాల్లో 11,854 హెక్టార్లలో పంటలు నష్టపోయిన 31,926 మంది రైతులకు 17.83 కోట్లను జగన్ బటన్ నొక్కి విడుదల చేశారు. 20 రోజులు గడిచినా పంట నష్టపరిహారం రాలేదు.



చేయూత రాలేదు

వైఎస్సార్ చేయూత ద్వారా రూ.18,500 మా ఖాతాలకు జమ చేశామన్నారు. మీటింగ్‌కు రమ్మని పిలిచి మీ డబ్బులకు జగన్ బటన్ నొక్కారు, సొమ్ములు వస్తాయని చెప్పారు. రెండు నెలలు కావస్తోంది. నేటికీ రాలేదు. బటన్ నొక్కినా నిధులు పడకపోవడం ఏంటో మరి.
వి.చక్రమ్మ, పిఠాపురం

వైఎస్ఆర్ చేయూత ఏదన్నా?

వైఎస్ఆర్ చేయూత కింద బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు చెందిన 45-60 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన మహిళలకు ఏటా రూ.18,500 అందిస్తున్నారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని మూడు నెలలు ముందుగానే సీఎం జగన్ బటన్ నొక్కే శారు.కాకినాడ జిల్లాలో 1,01,759 మంది మహిళలకు రూ.190.80 కోట్లు, కోనసీమ జిల్లాలో 89,619 మందికి 168.03 కోట్లు, తూర్పు గోదావరి జిల్లాలో 85,311 మందికి 159.96 కోట్లు విడుదల చేసినట్టు ప్రకటించారు. 56 రోజులు గడిచినా మహిళల ఖాతాలకు ఒక్క రూపాయి జమ కాలేదు. ఎన్నికల పుణ్యమా అని తమకు డబ్బులు ముందే ఇస్తున్నారని భావించిన మహిళలకు నిరాశే మిగిలింది.

అందని ఈబీసీ నేస్తం..

ఈబీసీ నేస్తం ద్వారా అగ్రవర్ణాల పేదలకు ఏటా రూ.15వేలు అందించే పథకం కింద సీఎం జగన్ మార్చి 14న బటన్ నొక్కి నిధులు విడుదల చేశారు. జిల్లాలో 9,516 మందికి రూ.14.27 కోట్లు, కోనసీమ జిల్లాలో 11,496 మందికి రూ.17.24 కోట్లు, తూర్పుగోదావరి జిల్లాలో 16,771 మందికి రూ.25.15 కోట్లు వారి ఖాతాలకు జమ చేస్తున్నట్టు ప్రకటించారు. ఇప్పటివరకూ ఖాతాలకు సొమ్ములు చేరలేదు. బటన్ నొక్కి 50 రోజులు గడిచినా నేటికి అదే పరిస్థితి.

ప్రచార ఆర్భాటమే..

వివిధ పథకాల కింద బటన్ నొక్కి నిధులు విడుదల ప్రచార ఆర్భాటం కోసం తప్ప ఆయా వర్గాలకు లబ్ధి చేకూర్చాలన్నది జగన్ లక్ష్యం కాదని పలువురు విమర్శిస్తున్నారు. నిధుల విడుదలను ఎన్నికల తేదీ ముందు వరకూ నిలిపివేసి రెండు, మూడు రోజులు ముందుగా విడుదల చేసి రాజకీయంగా లబ్ధి పొందాలన్నది జగన్ ఆలోచనగా చెబుతున్నారు. ఇలా చేయడం ఎన్నికల నియమావళికి విరుద్ధమని తెలిసినా అదే మార్గాన్ని ఎంచుకున్నారు. ఒకవేళ ఎవరైనా అందుకు అభ్యంతరం తెలిపితే నెపాన్ని ప్రతిపక్షాలపైకి నెట్టి వేయాలని వైసీపీ నేతలు భావిస్తున్నట్టు చెబున్నారు. పింఛన్ లబ్ధిదారులను కష్టాలపాలు చేస్తున్నట్టే.. బటన్ నొక్కి నిధులు విడుదల చేశామని చెప్పి ఆయా పథకాల లబ్ధిదారులను జగన్ బ్యాంకులు చుట్టూ తిరిగేలా చేస్తున్నారు.

ఐదేళ్లుగా అన్నదాతకు వర్రీయే!


'తూర్పు'న రూ.255 కోట్లు.. కాకినాడలో రూ.27 కోట్లు బకాయి

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)/సామర్లకోట, మే 3: ధాన్యం సేకరణ ఏటికేడు తీసికట్టే ఉంటోంది. ప్రతి సీజన్‌లోనూ ధాన్యం కొనుగోళ్ల లక్ష్యం లక్షల మెట్రిక్ టన్నుల్లో ఉంటుంది. కొనుగోలు చేసేది తూతూమంత్రంగా వేల టన్నుల్లోనే కొనుగోలు చేసి మమ అనిపిస్తున్నారు.తాజా దాళ్వా సీజన్‌లోను ఇదే తంతు కొనసాగుతోంది.అరకొరగా సేకరించిన ధాన్యానికి సొమ్ములు జమ చేయడంలో వైసీపీ ప్రభుత్వం రైతులకు చుక్కలు చూపెడుతోంది. ధాన్యం కొనుగోలు చేసిన 21 రోజుల్లోనే డబ్బులు జమ చేస్తామని ప్రభుత్వం చెప్పిన మాటలన్నీ నీటిమూటలుగా మిగిలిపోయాయి. టీడీపీ ప్రభుత్వంలో ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోపు రైతుల ఖాతాల్లో డబ్బులు జమయ్యేవి. ప్రస్తుత వైసీపీ ప్రభుత్వంలో ధాన్యం కొనుగోలు చేసినా డబ్బు ఎప్పుడు అందుతుందో తెలియక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో 55,315 హెక్టార్లలో వరిసాగు ఉండగా ఈ రబీ సీజన్‌లో 4.6 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని వ్యవసాయశాఖ అంచనా వేసింది. అందులో 3.2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సివిల్ సప్లయిస్ ద్వారా కొనుగోలు చేయడానికి ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే 94 శాతం కోతలు పూర్తయి ధాన్యం కళ్లాలోనూ, రోడ్లపై, మిల్లుల వద్ద ఉంది. ప్రభుత్వం ఇప్పటి వరకూ కేవలం 82,871 మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేసింది. దీనికి రూ.410 కోట్లకు పైగా రైతులకు చెల్లించాల్సి ఉండగా, ఇంత వరకూ రూ.155 కోట్లు మాత్రమే ఇచ్చారు. ఇంకా రూ.255 కోట్లు పెండింగ్ ఉంది. అది కాకుండా 2.4 లక్షల టన్నుల వరకూ ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంది. ఇదంతా ఎప్పుడు కొనుగోలు చేస్తారో తెలియని పరిస్థితి. కాకినాడ జిల్లాలో ప్రస్తుత దాళ్వా సీజన్‌లో రైతుల నుంచి 1.92 లక్షల మెట్రిక్ టన్నుల మేర ధాన్యం కొనుగోలు చేయాలని సివిల్ సప్లయ్ ద్వారా ప్రభుత్వం నిర్దేశించింది. శుక్రవారం నాటికి జిల్లాలో సీజన్ మొదలై నెల రో జులపైబడింది. కొనుగోలు చేసింది కేవలం 16,235 మెట్రిక్ టన్నులు మాత్రమే. రైతులకు రూ.35.48 కోట్లు చెల్లించాల్సి ఉండగా ఇప్పటికి రూ.8.97 కోట్లు మాత్రమే చెల్లించారు. ఇంకా రూ.26.51 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి.



ఎప్పటికి కొంటారో : బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురంలో రోడ్డుపై ఆరబెట్టిన ధాన్యం

నేడు కాకినాడలో చంద్రబాబు పర్యటన



కాకినాడ సిటీ, మే 3: టీడీపీ అధినేత చంద్రబాబు శనివారం కాకినాడలో పర్యటించనున్నారు. కాకినాడ సిటీ, రూరల్ నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారం చేస్తారు. ఏలూరు జిల్లా నూజివీడు నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి సాయంత్రం 6 గంటలకు కరప మండలం నడకుదురులో ఏర్పాటు చేసిన హెలిపాడ్ వద్ద దిగుతారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన నడకుదురు జంక్షన్‌లోని కుసుమసత్య కన్వెన్షన్ హాల్‌కు చేరుకుంటారు. సాయంత్రం 6.30 గంటలకు రోడ్‌షోగా బయలుదేరి కాకినాడ సిటీ అన్నమ్మ ఘాటీ సెంటర్, జగన్నాథపురం బ్రిడ్జి మీదుగా సినిమారోడ్ సంతచెరువు సెంటర్ వద్ద ప్రజాగళం సభ ప్రదేశానికి చేరుకుంటారు. అక్కడ పార్టీ నాయకుల పరిచయాలు, పార్టీలో పలువురి చేరికలు ఉంటాయి. అనంతరం రాత్రి 8.30 నుంచి 9.55 గంటల వరకు సంతచెరువు సెంటర్‌వద్ద ప్రజాగళం సభ జరగనుంది. రాత్రి 10 గంటలకు ఏడీబీ రోడ్‌లోని కొప్పవరం జంక్షన్‌లో బస చేస్తారు. 5వ తేదీ ఉదయం 9.20 గంటలకు హెలిపాడ్ వద్దకు చేరుకుని 9.30 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి వెళ్లనున్నారు.

6న ప్రధాని మోదీ రాక



- రాజమహేంద్రవరం రూరల్ వేమగిరి వద్ద బహిరంగ సభ
- భారీగా ఏర్పాట్లు- ట్రాఫిక్ మళ్లింపునకు చర్యలు

7

రెండో రోజూ విలపింఛన్

బ్యాంకుల్లో వృద్ధులు, దివ్యాంగుల పడిగాపులు

మండపేట, మే 3: వృద్ధులు, దివ్యాంగులు పింఛను కోసం రెండో రోజైన శుక్రవారం కూడా బ్యాంకుల వద్ద పడిగాపులు కాశారు. ప్రభుత్వం సచివాలయ ఉద్యోగులతో ఇంటికే పింఛను పంపిణీ చేసి ఉంటే తమకు ఈ పాట్లు ఉండేవి కాదన్నారు. ప్రభుత్వం కావాలని తమను బ్యాంకుల చుట్టూ ఎండవేళ తిప్పడం సరికాదంటున్నారు. గత రెండు రోజులుగా పెన్షనర్లు బ్యాంకుల వద్ద బారులు తీరుతున్నారు. చాలా మంది వృద్ధుల ఖాతాలు పనిచేయపోవడంతో బ్యాంకు ఉద్యోగులు వారి ఖాతాలను సరిచేసి పింఛను అందించే ప్రయత్నం చేస్తున్నారు. మండపేట పట్టణంలోని పలు ప్రధాన బ్యాంకుల్లో వృద్ధులు పింఛను కోసం ఎదురుచూపులు చూశారు. ఇప్పటికైనా తమ ఇంటికి పింఛను ఇచ్చే ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.



పింఛను కోసం మండపేటలోని ఓ బ్యాంకులో బారులు తీరిన వృద్ధులు

రామచంద్రపురం సమగ్ర అభివృద్ధే ధ్యేయం

రామచంద్రపురం అసెంబ్లీ కూటమి అభ్యర్థి వాసంశెట్టి సుభాష్

రామచంద్రపురం నియోజకవర్గంలో వైసీపీ తరపున ఎంపీ, మంత్రి, ఎమ్మెల్సీ ఉన్నారు. అయినా అభివృద్ధి శూన్యం. రహదారులు అధ్వానంగా ఉన్నాయి... డ్రైనేజీ వ్యవస్థా అంతే... కాలువలు, డ్రెయిన్లలో పూడికతీయించి సాగునీటిపారుదలను మెరుగుపరుస్తా. తొలి ఏడాదిలోనే సమస్యలను పరిష్కరించి ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపడతా... ప్రచారంలో ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తోంది. నామినేషన్ రోజునే నా విజయం దాదాపు ఖరారైంది. మెజార్టీపైనే దృష్టి సారించా... రామచంద్రపురంలో శాశ్వత నివాసం నిర్మించుకుని ప్రజలకు అందుబాటులో ఉంటాను. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తాను అంటున్న

రామచంద్రపురం అసెంబ్లీ కూటమి అభ్యర్థి వాసంశెట్టి సుభాష్‌తో 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక ఇంటర్వ్యూ... 7లో



శెట్టిబలిజల సత్తా చాటుదాం

- అమలాపురం లోక్‌సభ కూటమి అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్
- పేరూరులో ఆత్మీయ సమావేశం



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న హరీష్‌మాధుర్

అమలాపురం రూరల్, మే 3: శెట్టిబలిజ సంఘీయులు సత్తాచూపించాల్సిన సమయం ఆసన్నమైందని అమలాపురం లోక్‌సభ స్థానానికి కూటమి తరపున టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గంటి హరీష్‌మాధుర్ పేర్కొన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో శెట్టిబలిజలకు చేసింది ఏమీ లేదన్నారు. శెట్టిబలిజపేటల్లో ఎక్కడైనా చిన్న అభివృద్ధి పనైనా చేశారా అని ఆయన ప్రశ్నించారు. గత ఎన్నికల్లో వైసీపీకి ఎక్కువ మంది శెట్టిబలిజలు అండగా నిలిస్తే వారిపైనే కేసులు పెట్టించారని విమర్శించారు. అమలాపురం అల్లర్ల కేసులో అమాయకులపై అక్రమ కేసులు పెట్టిన మాట వాస్తవమా కాదా అన్నారు. పేరూరులోని బీఆర్కే ఫంక్షన్ హాలులో శుక్రవారం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి చంద్రమౌళి అధ్యక్షతన శెట్టిబలిజ సంఘీయుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. తొలుత రామచంద్రపురం అసెంబ్లీ కూటమి అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ శెట్టిబలిజ సంఘీయులను వైసీపీకి చెందిన పలువురు నాయకులు బెదిరిస్తున్నారని ఆరోపించారు. శెట్టిబలిజల్లో కొందరు పెద్దలు దళారులుగా తయారయ్యారని, అమలాపురం అల్లర్ల కేసుల్లో వారి నిజస్వరూపం బయటపడిందన్నారు. ప్రశాంతంగా ఉన్న కోనసీమలో కులాల మధ్య చిచ్చులు పెట్టిన ఘనత వైసీపీకే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీ కార్పొరేషన్ ద్వారా ఒక్కరికి కూడా రుణం ఇవ్వలేని దుస్థితి నెలకొందన్నారు. కల్లుగీత కార్మికులకు కనీస సాయం అందించలేని పరిస్థితుల్లో వైసీపీకి ఎందుకు ఓటేయాలని ప్రశ్నించారు. తక్కువ వ్యవధిలోనే నన్ను నమ్మి రామచంద్రపురం సీటును చంద్రబాబు కేటాయించారన్నారు. అటువంటి వ్యక్తికి జిల్లాలోని అన్ని అసెంబ్లీ సీట్లతో పాటు లోక్‌సభ స్థానాన్ని గెలిపించి బహుమతిగా ఇవ్వాల్సిన బాధ్యత సంఘీయులపై ఉందన్నారు. వైసీపీ ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతోందని, అందుకు ఎన్నో ఉదాహరణలు ఉన్నాయని వివరించారు. తన విజయం కోసం చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఎంతో కృషి చేస్తున్నారని వివరించారు. హరీష్‌మాధుర్, ఆనందరావులను గెలిపించాలని పిలుపునిచ్చారు. అమలాపురం అసెంబ్లీ కూటమి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు మాట్లాడుతూ బీసీ కార్పొరేషన్‌తో పాటు ఆదరణ పథకం ద్వారా శెట్టిబలిజ అనుబంధ కులాలను టీడీపీ ప్రభుత్వం ఆదుకుని అండగా నిలిచిందన్నారు. కల్యాణ మండపం నిర్మాణం శెట్టిబలిజల చిరకాల వాంఛ అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అధునాతన కల్యాణ మండపం నిర్మించేందుకు కృషి చేస్తానన్నారు. తొలుత మహాత్మాజ్యోతిబాపూలే తదితరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. శెట్టిబలిజ సంఘీయులు గజమాలతో సత్కరించారు. సమావేశంలో తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి, బొంతు పాపాయి, నాయకులు మల్లుల పోలయ్య, గుబ్బల రామచంద్రరావు, కడలి వెంకటేశ్వరరావు, గుబ్బల నాగేశ్వరరావు, వాసంశెట్టి జగదీష్, పలివెల శ్రీనివాసరావు, చొల్లంగి సత్యసాయిబాబా, మామిడిశెట్టి శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.



అమలాపురం లోక్‌సభ అభ్యర్థి హరీష్‌మాధుర్, అమలాపురం, రామచంద్రపురం అసెంబ్లీ అభ్యర్థులు ఆనందరావు, సుభాష్‌లను గజమాలతో సత్కరిస్తున్న శెట్టిబలిజ సంఘీయులు



ఎన్ఆర్ఐ కిషోర్ బలుసు

ఓటర్లు వస్తున్నారు..!

వయా పోలింగ్ బూత్



దటీజ్ బాలయోగి..

ఉప్పలగుప్తం:



లోక్‌సభ సభ్యునిగా ప్రజలతో మమేకమైన తీరు జీఎంసీ బాలయోగికి మాత్రమే ప్రత్యేకం. ప్రస్తుతం ఎమ్మెల్యేలకు, ఎంపీలకు మధ్య సంబంధాలు అంతంతమాత్రమే. తమ నియోజకవర్గాల్లో కార్యక్రమాలకు ఎమ్మెల్యేలు ఎంపీలను దూరంగానే ఉంచుతున్నారు. ఒకే పార్టీకి చెందిన వారైనా గ్రూపు రాజకీయాలు మామూలే. కార్యకర్తలు సైతం రెండు గ్రూపులుగా విడిపోవడం మనం చూస్తున్నాం. బాలయోగి విషయానికి వస్తే ఆయన రూటే సెపరేటు. ప్రతివారం ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గంలో ఆయన ఎమ్మెల్యేతో కలిసి తిరిగేవారు. సమస్యలపై ఆరా తీసేవారు. ఎవరైనా ఆయనను ఆహ్వానిస్తే స్థానిక ఎమ్మెల్యేను అడిగారా అని ప్రశ్నించేవారు. సమావేశాల్లో స్థానిక సర్పంచ్ లేకపోతే ఆయన వచ్చే వరకు కార్యక్రమాన్ని ప్రారంభించడానికి ససేమిరా అనేవారు. లోక్‌సభ స్పీకర్‌గా ఉన్నా ఇదే పద్ధతిని ఆయన అవలంబించారు. అమలాపురం కాటన్ గెస్ట్ హౌస్‌లో రాత్రి సమయాల్లో పాత్రికేయులతో ముచ్చటించేవారు. విషయాలు తెలుసుకునేవారు. దేశ రాజధాని నుంచి నియోజకవర్గానికి వచ్చిన ప్రతిసారీ తన వెంట ఒక కేంద్ర మంత్రిని తీసుకుని వచ్చేవారు. కోనసీమలో ప్రధాన సమస్యలు ఆ రోజు పత్రికల్లో ప్రచురితమయ్యేలా పాత్రికేయులకు ఉప్పందించేవారు. మరుసటి రోజు సమావేశంలో పత్రికలను మంత్రి ముందుంచేవారు. తక్షణం సమస్య పరిష్కారానికి మంత్రి నుంచి నిధుల మంజూరు సాధించేవారు. ఏ గ్రామానికి వెళ్లినా ఎక్కువ మందిని పేర్లతో పలకరించేవారు. లోకసభ స్పీకర్‌గా కూడా అదే బాణీ కొనసాగించారు. దటీజ్ బాలయోగి.



అప్పటి అల్లవరం ఎమ్మెల్యే చిల్లా జగదీశ్వరితో కలిసి గ్రామాల్లో పర్యటిస్తున్న బాలయోగి

అక్కడి వారు ఇక్కడకు

- వలస ఓటర్లకు గాలం..
- అన్వేషణలో ప్రధాన రాజకీయ పార్టీలు
- ప్యాకేజీలు ఇచ్చేందుకు అభ్యర్థులు సిద్ధం
- ఇప్పటికే రైలు, బస్ టిక్కెట్లు రిజర్వేషన్లు
- ఎన్నికలపై ఆసక్తి ప్రదర్శిస్తున్న వలస ఓటర్లు
- బంధుమిత్రులతో రాయబారాలు
- వలస ఓటర్లకు ప్రత్యేక ప్యాకేజీలు..





అమలాపురం టౌన్, మే 3: దూర ప్రాంతాల్లో ఉన్న ఓటర్లను ఎన్నికల తేదీ నాటికి ఆయా నియోజకవర్గాలకు తీసుకువచ్చే విధంగా రాజకీయ పార్టీల అభ్యర్థులు సన్నాహాలు చేస్తున్నారు. హైదరాబాద్ సహా వివిధ కీలక నగరాలు, పట్టణాలకు వలసలు వెళ్లిన కుటుంబాల ఓట్లను అన్వేషించడంపై టీడీపీ, జనసేన, వైసీపీ నాయకులు దృష్టి సారించారు. ఏ ఒక్క ఓటునూ వదులుకోకూడదని పట్టుదలతో ముందుకు సాగుతున్నారు. ప్యాకేజీల పరంగా ఆయా ప్రాంతాల్లోని ఓటర్లను తమ తమ నియోజకవర్గాలకు రప్పించుకునేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఓటర్ల జాబితాలో ఉన్న పేర్ల ఆధారంగా వారు ఎక్కడున్నదీ బంధుమిత్రులను అడిగి తెలుసుకుంటూ వారిని రప్పించేందుకు రైల్వే, ఆర్టీసీ, ప్రైవేటు బస్సులకు కూడా అప్పుడే టిక్కెట్లు రిజర్వేషన్ చేయించే పనిలో అభ్యర్థుల తాలూకా అనుచరగణాలు నిమగ్నమయ్యాయి.


ఈ నెల 13న పోలింగ్ జరగనుంది. జిల్లాలో అమలాపురం లోక్‌సభతో పాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికలు జరుగుతున్నందున అభ్యర్థులు ప్రతి ఓటునూ విలువైనదిగా పరిగణిస్తున్నారు. ఎంత దూరాన ఉన్నా వచ్చి ఓటు వేయాలని వారి అనుచరులు ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. ముమ్మిడివరం, కొత్తపేట అసెంబ్లీల టీడీపీ అభ్యర్థులు దాట్ల బుచ్చిబాబు, బండారు సత్యానందరావు ఇప్పటికే హైదరాబాద్ వెళ్లి వలస ఓటర్లతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. ఈసారి కచ్చితంగా జిల్లాకు వచ్చి ఓట్లు వేస్తామని వారంతా హామీ ఇచ్చారు. ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లిన యువకులు రాష్ట్రానికి జరిగిన నష్టాన్ని గుర్తించి స్వచ్ఛందంగానే ఓటు వేయడానికి సిద్ధంగా ఉన్నారని టీడీపీ నాయకులు చెబుతున్నారు. రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రాకపోవడంతో ఐదేళ్ల కాలంలో జిల్లా నుంచి వేలాది కుటుంబాలు హైదరాబాద్‌తో పాటు వివిధ ముఖ్య పట్టణాలకు వలస వెళ్లి ఉపాధి పొందుతున్నారు. వారితో పాటు ఉద్యోగ రీత్యా బెంగళూరు, చెన్నై, ముంబై వంటి ముఖ్య నగరాల్లో ఉన్న వారిని గుర్తించి వారి ఓట్లు వేయించుకునేందుకు ప్రధాన పార్టీలు పోటీపడుతున్నాయి. చివరకు విదేశాల్లో ఉన్న వారిని స్వదేశానికి రప్పించే ప్రయత్నాలు ఒకపక్క జరుగుతుండగా.. పార్టీలపై అభిమానంతో సెలవులు పెట్టుకుని వచ్చేందుకు మరికొందరు సిద్ధపడుతున్నారు. కోనసీమ వ్యాప్తంగా పలు నియోజకవర్గాల్లోని వలస ఓటర్లను గుర్తించే పనిలో కొన్ని బృందాలు పనిచేస్తున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్‌కు వలస వెళ్లిన వారి సంఖ్య 50 వేలు వరకు ఉండవచ్చని అంచనా. వారితో పాటు దేశ, విదేశాలు, వివిధ పట్టణాల్లో ఉన్నవారి సంఖ్య కూడా వేలల్లోనే ఉంది. వారిలో కొందరితో ఫ్యామిలీ ప్యాకేజీతో పాటు వ్యక్తిగత ప్యాకేజీలు మాట్లాడుకుని రప్పిస్తున్నారు. రైలు, బస్సు టిక్కెట్లను అడ్వాన్స్ బుకింగ్ చేస్తూ వారిని ఆకట్టుకుంటున్నారు. ఒక్కో నియోజకవర్గంలో వలస ఓటర్లు 6 వేల నుంచి 10 వేలకు పైగా ఉండవచ్చని రాజకీయ పార్టీల అంచనా. కచ్చితంగా తమ పార్టీకి ఓటేస్తారనే నమ్మకం ఉన్న వ్యక్తులను వారి బంధువుల ద్వారా గుర్తించి రప్పించడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. రాజోలు, కొత్తపేట, గన్నవరం, ముమ్మిడివరం, అమలాపురం, మండపేట నియోజకవర్గాలతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉన్న టీడీపీ, వైసీపీ, జనసేన అభ్యర్థులు ప్యాకేజీలు సిద్ధం చేసి వలస ఓటర్లను రప్పించేందుకు రంగం సిద్ధం చేశారు. ఆయా పార్టీల తరపున అభ్యర్థించడం ద్వారా ఓటర్లు ఇక్కడకు వస్తే వారికి ఖర్చులు తగ్గడంతో పాటు కుటుంబ సభ్యులతో రెండు రోజుల పాటు గడిపే అవకాశం ఉండటంతో వారు కూడా ఈ ఎన్నికల పట్ల ఆసక్తి చూపుతున్నారు. ఈ సారి జరిగే ఎన్నికలకు కొందరు అభిమానంగా తామే వచ్చి ఓట్లు వేస్తామని అభ్యర్థులకు వర్తమానాలు పంపిస్తున్నారు. మరికొందరికైతే నజరానాలు ఇచ్చేందుకు కూడా నాయకులు సిద్ధపడుతున్నారు.

అరాచకాలు చూడలేక..

- కూటమికి మద్దతుగా ఆస్ట్రేలియా నుంచి వచ్చాం..
- చంద్రబాబు సారథ్యంలోనే ఉద్యోగాల కల్పన

ఆలమూరు, మే 3: రాష్ట్రంలో జరుగుతున్న ఆరాచకం చూడలేక విదేశాల్లో ఉన్న వారందరూ ఇక్కడి వచ్చి టీడీపీ తరపున ప్రచారం చేస్తున్నట్లు ఎన్ఆర్ఐ (ఆస్ట్రేలియా) కిషోర్ బలుసు చెప్పారు. గత 20 రోజులుగా రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో ప్రచారం చేశామని, ప్రస్తుతం సొంత నియోజకవర్గం కొత్తపేటలో కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావుకు మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం జొన్నాడలో శుక్రవారం జరిగిన బండారు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కిషోర్ మీడియాతో మాట్లాడారు. తనది ఆత్రేయపురం మండలం వద్దిపర్రు గ్రామం అని, 20ఏళ్ల క్రితమే ఆస్ట్రేలియాలో స్థిరపడ్డామన్నారు. రాష్ట్రంలో జగన్ అరాచక పాలనతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి ఇక్కడికి వచ్చి ప్రచారం చేస్తున్నట్టు చెప్పారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉంటే రాష్ట్రం బాగుంటుందన్నారు. ఏపీలోని యువతకు లక్ష ఉద్యోగాలు కల్పించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. చంద్రబాబునాయుడుతో ఆదివారం విశాఖలో ఎన్ఆర్ఐలతో జరిగే సమావేశంలో తాము లక్ష ఉద్యోగాల హామీ ఇస్తామని కిషోర్ చెప్పారు.

ఖైదీలకూ ఓటు హక్కు



పెద్దాపురం, మే 3 : రాజ్యాంగం ప్రకారం 18 ఏళ్లు నిండిన భారతీయులకు ఓటుహక్కు ఉంటుంది. అయితే వివిధ కారణాలతో జైలుశిక్ష అనుభవిస్తున్న ఖైదీలకు ఓటుహక్కు ఉంటుందా.. ఉండదా అనే ప్రశ్న చాలామందికి తలెత్తుతుంది. అయితే ఖైదీలు కూడా ఓటుహక్కు వినియోగించుకునే అవకాశముంది. పలు నేరాల్లో జైలుశిక్ష అనుభవిస్తున్న ఖైదీలు ప్రివెంటీవ్ డిటర్మినేషన్ పద్ధతిలో ఓటు వేయవచ్చు. నియోజకవర్గం పేరును సూచిస్తూ తాము ఓటర్లమని పోలింగ్ బూత్, ఓటరు క్రమసంఖ్యతో ఓటువేసే అవకాశం కల్పించాలని రాత పూర్వకంగా జైలర్‌ను కోరాలి. ఖైదీలు సూచించిన ప్రాంతాల నుంచి పోస్టల్ బ్యాలెట్‌ను తెప్పించి ఓటు వేసే అవకాశం కల్పిస్తారు.



నల్లా రెడ్డినాయుడు



కుసుమ కృష్ణమూర్తి



బీఎస్ మూర్తి



ఏజేవీబీ మహేశ్వరరావు



జీఎంసీ బాలయోగి



జి.విజయకుమారి



కేఎస్ఆర్ మూర్తి



జీవీ హర్షకుమార్



పండుల రవీంద్రబాబు



చింతా అనురాధ

అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గం



పార్లమెంట్ నమూనాలో ఆర్డీవో కార్యాలయం

(ఆంధ్రజ్యోతి-అమలాపురం):

పార్లమెంట్‌లో అసెంబ్లీలు

అమలాపురం(ఎస్సీ), కొత్తపేట, రామచంద్రపురం, మండపేట, రాజోలు(ఎస్సీ), పి.గన్నవరం(ఎస్సీ), ముమ్మిడివరం.

చమురు క్షేత్రాలతో అంతర్జాతీయ ఖ్యాతి

9 సార్లు కాంగ్రెస్, ఆరుసార్లు టీడీపీదే హవా..

దళిత యోధుల గడ్డ

ప్రముఖ నేతలను అందించిన అమలాపురం పార్లమెంట్

విశిష్టతల సమాహారం

అమలాపురం ఎస్సీ రిజర్వుడు లోక్‌సభ నియోజకవర్గం అపార సంపదనిచ్చే చమురు క్షేత్రాల ద్వారా అంతర్జాతీయ చిత్రపటానికెక్కింది. ఆప్యాయతా అనురాగాలను పంచే ప్రజలు ఉన్న ఈ నియోజకవర్గంలో ప్రకృతి వనరులు పుష్కలంగా ఉన్నాయి. ఒక వైపు సముద్ర తీరం, మూడువైపులా గోదావరి నదీపాయల నడుమ కేరళ తరహా అందాలతో పర్యాటకులను మంత్రముగ్ధుల్ని చేసే సొగసులు నియోజకవర్గం సొంతం. పాడి పంటలకు పుట్టినిల్లు. వరి, కొబ్బరితో పాటు అంతర్జాతీయంగా డాలర్ల పంట కురిపించే ఆక్వా కల్చర్ ప్రధాన పంటలు. అంతర్వేది, వాడపల్లి, అయినవిల్లి, మురమళ్ల, ద్రాక్షారామ, ద్వారపూడి, కోటిపల్లి, అప్పనపల్లి వంటి ప్రసిద్ధినొందిన పుణ్యక్షేత్రాలకు నిలయం. గాడిమొగలోని రిలయన్స్, జీఎస్‌పీఎస్, ఎస్.యానాంలోని కెయిర్న్ ఎనర్జీ, ఓడలరేవులోని ఓఎన్జీసీ చమురు క్షేత్రాలు నియోజకవర్గానికి ఎనలేని ప్రాధాన్యతను పెంచాయి. కుటీర పరిశ్రమలు, కొబ్బరి ఆధారిత పరిశ్రమలు ఇక్కడి ప్రజల జీవనోపాధిలో కీలకంగా ఉన్నాయి. 216 జాతీయరహదారి, కోటిపల్లి-నరసాపురం మధ్య రైల్వేలైన్ నిర్మాణాలు ప్రగతిపథంలో కొనసాగుతూనే ఉన్నాయి. అన్ని వనరులు పుష్కలంగా ఉండడంతో జిల్లా పునర్విభజనలో భాగంగా అమలాపురం కేంద్రంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాగా ఆవిర్భవించింది. కాగా పార్లమెంటు నియోజకవర్గంలో రాజకీయ పార్టీల ప్రాధాన్యత కంటే సామాజికవర్గాల సమీకరణలపైనే లోక్‌సభ ఎన్నికల ఓటర్ల నాడి ఆధారపడి ఉంటుంది.

సమస్యలు ఇవీ..



కోటిపల్లి-ముక్తేశ్వరం రైల్వేలైన్ నిర్మాణ పనులు

నియోజకవర్గంలో ప్రధానమైనది తాగునీటి సమస్య. ఇందుకోసం తీరప్రాంత మండలాల్లో ప్రత్యేకమైన తాగునీటి ప్రాజెక్టులు ఏర్పాటు చేయాల్సి ఉంది. అమలాపురం, మండపేట, రామచంద్రపురం పట్టణాల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, మంచినీటి ప్రాజెక్టు ఏర్పాటు అనివార్యం. సాగునీటి కాల్వల ఆధునికీకరణ పనులు అమలు చేయాల్సి వుంది. సఖినేటిపల్లి-నరసాపురం మధ్య వారధి నిర్మించాల్సి ఉంది.

అమలాపురంలో కలెక్టరేట్





ఓటర్ల వివరాలు ఇలా..

అమలాపురం(ఎస్సీ) పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో 15,24,500 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 7,55,914 మంది పురుషులు, 7,68,565 మంది మహిళలు ఉన్నారు. ఇతరులు 21 మంది ఉన్నారు. పార్లమెంటు పరిధిలో 1644 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 615 సమస్యాత్మక, 358 అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి.

అభివృద్ధి బాటలో..

సుమారు రూ.వెయ్యి కోట్ల పైబడిన వ్యయంతో చిరకాల కల అయిన కోటిపల్లి-నరసాపురం రైల్వేలైన్ నిర్మాణం పురోభివృద్ధిలో కొనసాగుతూనే ఉంది. 216 జాతీయ రహదారి అభివృద్ధి విస్తరణ పనులు శరవేగంగా సాగుతున్నాయి.



అమలాపురం ఎస్సీ రిజర్వ్‌డ్ లోక్‌సభ నియోజకవర్గం ఆది నుంచి కాంగ్రెస్ పార్టీకి కంచుకోట. కాకినాడ ద్విసభ్య నియోజకవర్గంలో ప్రజా సోషలిస్ట్, కమ్యూనిస్ట్ పార్టీల పాలకుల ఏలుబడి నుంచి 1962లో తొలిసారిగా ఈ నియోజకవర్గం ఆవిర్భవించింది. అమలాపురం లోక్‌సభ రిజర్వ్‌డ్ స్థానం ఆవిర్భావం నుంచి ఇప్పటివరకు 15 పర్యాయాలు జరిగిన ఎన్నికల్లో 9 పర్యాయాలు కాంగ్రెస్ పార్టీకి చెందిన దళిత నాయకులు ఎన్నికయ్యారు. అయిదుసార్లు తెలుగుదేశం పార్టీ నాయకులు విజయకేతనం ఎగురవేశారు. ఒకసారి వైసీపీ గెలుపొందింది. ఈ స్థానం నుంచి ఎన్నికైన వారిలో భయ్యా

మొదట్లో కాంగ్రెస్‌కు కంచుకోట

సూర్యనారాయణమూర్తి అలియాస్ బీఎస్ మూర్తి పుష్కర కాలం పాటు కేంద్ర ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన చరిత్ర ఉంది. ఆ తర్వాత జీఎంసీ బాలయోగి రెండు పర్యాయాలు లోక్‌సభ స్పీకర్ హోదాలో ఈ నియోజకవర్గ కీర్తి ప్రతిష్ఠలను దేశంలోనే కాకుండా అంతర్జాతీయంగా కీర్తిని గడించారు. ఇక్కడ నుంచి పోటీ చేసి గెలిచిన వారికి మళ్లీమళ్లీ పట్టం కట్టే చరిత్ర నియోజకవర్గ ఓటర్లది. బీఎస్ మూర్తి నాలుగు పర్యాయాలు, కుసుమ కృష్ణమూర్తి, జీఎంసీ బాలయోగిలు మూడేసి పర్యాయాలు ఎంపీలుగా పనిచేశారు. సీనియర్ ఐఏఎస్ అధికారి అప్పట్లో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన కేఎస్ఆర్ మూర్తి ఇక్కడ నుంచి ఒక పర్యాయం ఎంపీగా పనిచేశారు. జీవీ హర్షకుమార్ రెండు పర్యాయాలు పనిచేశారు. దివంగత నేత బాలయోగి సతీమణి విజయకుమారి, ఏజేవీబీ మహేశ్వరరావులు ఇక్కడ నుంచి లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించారు. 2009లో జరిగిన పునర్విభజనలో గత లోక్‌సభలో ఉండే అల్లవరం, తాళ్లరేవు అసెంబ్లీ నియోజకవర్గాలు గల్లంతై ఆ స్థానంలో మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాలతో జిల్లాలోనే అతిపెద్ద పార్లమెంటు నియోజకవర్గంగా ఆవిర్భవించింది.

పార్లమెంట్ నియోజకవర్గ చరితం

అమలాపురం ఎస్సీ రిజర్వ్‌డ్ లోక్‌సభ స్థానం నుంచి దళిత యోధులు ఎన్నికయ్యారు. ఉప ఎన్నికతో 15 పర్యాయాలు జరిగిన ఎన్నికల్లో తొమ్మిదిసార్లు కాంగ్రెస్ పార్టీకి చెందిన అభ్యర్థులే విజయకేతనం ఎగురవేశారు. టీడీపీ ఆవిర్భావం నుంచి ఇప్పటివరకు అయిదు పర్యాయాలు ఆ పార్టీ నేతలు ఎన్నికయ్యారు. 1962 నుంచి 1971 వరకు మూడు సార్లు జరిగిన ఎన్నికల్లో బీఎస్ మూర్తి కాంగ్రెస్ నుంచి ప్రత్యర్థులను ఓడించి వరుస విజయాలతో లోక్‌సభకు ఎన్నికయ్యారు. అంతకుముందే ఆయన రెండుసార్లు కాకినాడ, ఏలూరు నుంచి లోక్‌సభకు ఎన్నికైన చరిత్ర ఉంది. ఆయన స్వస్థలం మండల కేంద్రమైన మామిడికుదురు. పుష్కర కాలంపాటు కేంద్రంలో సామాజిక అభివృద్ధి, సహకారం, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రిగా పనిచేసి అప్పట్లో ఓ గొప్ప దళిత నేతగా చరిత్రకెక్కారు. కాగా 1977లో తొలిసారిగా కుసుమ కృష్ణమూర్తి కాంగ్రెస్ నుంచి పోటీ చేసి బీఎల్‌డీ పార్టీకి చెందిన బీవీ రమణయ్యపై ఘన విజయం సాధించారు. తిరిగి 1980లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కుసుమ కృష్ణమూర్తి రిపబ్లికన్ పార్టీ నాయకురాలు జె.ఈశ్వరీభాయిపై కాంగ్రెస్ నుంచి ఎన్నియ్యారు. 1984లో టీడీపీ ఆవిర్భావ సమయంలో జరిగిన ఎన్నికల్లో పార్టీ నుంచి ఏజేవీబీ మహేశ్వరరావు, కుసుమ కృష్ణమూర్తి(కాంగ్రెస్)పై విజయం సాధించారు. 1989లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీ చేసిన బుచ్చిమహేశ్వరరావుపై కుసుమ కృష్ణమూర్తి గెలుపొందారు. మూడేళ్లలో జరిగిన మధ్యంతర ఎన్నికల్లో టీడీపీ నుంచి జీఎంసీ బాలయోగి పోటీ చేసి కుసుమ కృష్ణమూర్తిపై విజయం సాధించారు. 1996లో జరిగిన ఎన్నికల్లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి హోదాలో పనిచేసిన సీనియర్ ఐఏఎస్ అధికారి కేఎస్ఆర్ మూర్తి కాంగ్రెస్ నుంచి పోటీ చేసి టీడీపీ అభ్యర్థి జీఎంసీ బాలయోగిని ఓడించారు. 1998లో జరిగిన ఎన్నికల్లో కేఎస్ఆర్ మూర్తిని ఓడించి బాలయోగి విజయకేతనం ఎగురవేశారు. అప్పట్లో దేశంలోనే అత్యున్నతమైన లోక్‌సభ స్పీకర్‌గా బాధ్యతలు స్వీకరించారు. తర్వాత 1999లో జరిగిన మధ్యంతర ఎన్నికల్లో బాలయోగి కాంగ్రెస్ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావుపై విజయం సాధించి తిరిగి లోక్‌సభాపతిగా రెండవసారి ఎన్నికయ్యారు. పదవి నిర్వహిస్తుండగానే హెలికాప్టర్ దుర్ఘటనలో 2002 మార్చి 3వ తేదీన బాలయోగి దుర్మరణం చెందారు. ఆ తర్వాత జరిగిన ఉప ఎన్నికల్లో బాలయోగి సతీమణి జి.విజయకుమారి అత్యధిక మెజార్టీతో ఎన్నికై 2004 వరకు పదవిలో కొనసాగారు. 2004లో జరిగిన ఎన్నికల్లో టీడీపీకి చెందిన దున్నా జనార్ధనరావుపై కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన జీవీ హర్షకుమార్ విజయం సాధించారు. లోక్‌సభ నియోజకవర్గ పునర్విభజన తర్వాత 2009లో లోక్‌సభకు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్‌కు చెందిన జీవీ హర్షకుమార్ ప్రజారాజ్యం పార్టీ అభ్యర్థి పి.ప్రమీలాదేవిపై విజయం సాధించి దశాబ్దకాలం పాటు నియోజకవర్గానికి ఎంపీగా కొనసాగారు. కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉండే ఈ స్థానం నుంచి ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల్లో తొమ్మిది పర్యాయాలు ఆ పార్టీ అభ్యర్థులే విజయం సాధించిన చరిత్ర నేపథ్యంలో 2024లో జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ పరిస్థితి నియోజకవర్గంలో అంతంతమాత్రంగానే ఉంది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ తరపున చింతా అనురాధ టీడీపీ అభ్యర్థి హరీష్‌మాధుర్‌పై విజయం సాధించారు. ఈ సారి జరిగే ఎన్నికల్లో ప్రధాన పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులుగా ఇప్పటి వరకు 16 మంది బరిలో ఉన్నారు. అయితే ప్రధాన పోటీ మాత్రం కూటమి తరపున టీడీపీ, వైసీపీల మధ్యే నెలకొంది.

రామచంద్రపురాన్ని సమగ్రంగా అభివృద్ధి చేస్తా



- నామినేషన్ రోజే నా విజయం ఖరారు
- పవన్‌కల్యాణ్, చంద్రబాబు ప్రచారంతో మరింత ఊపు
- ఇక్కడే శాశ్వత నివాసం నిర్మాణం
- అందరికీ అందుబాటులో ఉంటా

రామచంద్రపురం అసెంబ్లీ కూటమి అభ్యర్థి వాసంశెట్టి సుభాష్

ప్రశ్న: ఎన్నికల ప్రచారం ఎలా సాగుతోంది?

సుభాష్: తిరునాళ్లలా జరుగుతోంది. అతి తక్కువ సమయంలో ఎక్కువ మందిని కలిశాను. గ్రామాల్లో ప్రజలు ఎదురువచ్చి స్వాగతం పలుకుతున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు మండుటెండలోనూ ఉత్సాహంగా పాల్గొంటున్నారు.

ప్రజల స్పందన ఎలా ఉంది?

అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు. కూటమిని గెలిపించుకోవాలన్న కృతనిశ్చయంతో ఉన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు, విద్యుత్ చార్జీలు పెరిగిపోవడంతో మహిళలు ప్రభుత్వంపై ఆగ్రహంతో ఉన్నారు. రాక్షస పాలనకు చరమగీతం పాడేందుకు సిద్ధంగా ఉన్నారు.

మీకు విజయావకాశాలు ఎలా ఉన్నాయి?

నా విజయం నామినేషన్ దాఖలు రోజునే దాదాపు ఖరారైంది. రామచంద్రపురంలో అంతకు ముందెన్నడూ లేని రీతిలో నా నామినేషన్ దాఖలు కార్యక్రమానికి వేలాది మంది తరలివచ్చారు. ద్రాక్షారామలో పవన్‌కల్యాణ్, చంద్రబాబు బహిరంగ సభ విజయంపై నమ్మకాన్ని మరింత పెంచింది.

గత పాలకుల హయాంలో జరిగిన అన్యాయాలు?

నవరత్నాలు పేరుతో రూపాయి ఇచ్చి పన్నుల రూపంలో ఐదు రూపాయలు తీసుకున్నారు. బీసీ కార్పొరేషన్ రుణాలు, ఆదరణ పథకం తీసేశారు. బీసీలు ఆర్థికంగా దెబ్బతిన్నారు. నియోజకవర్గంలో మంత్రి, రాజ్యసభ సభ్యుడు, ఎమ్మెల్సీ ఉండి కూడా ఈ ఐదేళ్లలో ఎటువంటి అభివృద్ధీ చేయలేదు.

కూటమి పార్టీల సహకారం ఎలా ఉంది?

పూర్తి సహకారం అందిస్తున్నారు. జనసేన నాయకులు, కార్యకర్తలు అయితే చాలా ఉత్సాహంగా పనిచేస్తున్నారు. నేను వచ్చినా, రాకున్నా ఇంటింటికీ తిరిగి సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం చేస్తున్నారు. బీజేపీ కార్యకర్తలు తమవంతు కృషి చేస్తున్నారు. యువతతో కూడిన జనసేన, అనుభవంతో కూడిన టీడీపీ, ముందస్తు ప్రణాళిక ఉన్న బీజేపీ కలయికతో రాష్ట్రంలోను, రామచంద్రపురంలోను తప్పక విజయం సాధిస్తాం.

కూటమి మేనిఫెస్టోపై ప్రజా స్పందన ఎలా ఉంది?

కూటమి మేనిఫెస్టోను ప్రజలు స్వాగతిస్తున్నారు. సూపర్ సిక్స్ పథకాలకు మంచి స్పందన ఉంది. సంక్షేమం, అభివృద్ధి మేళవింపుతో వున్న మేనిఫెస్టు కూటమి విజయంలో కీలక పాత్ర పోషించనుంది.

నియోజకవర్గ అభివృద్ధికి మీ ప్రణాళిక?

రామచంద్రపురాన్ని సమగ్రంగా అభివృద్ధి చేస్తాను. నియోజక వర్గంలో పూర్తిగా అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరుస్తాను. ఇంటింటికీ కుళాయి ద్వారా తాగునీరు అందిస్తాను. రోడ్లను నిర్మింపచేస్తా. ద్రాక్షారామ భీమేశ్వరాలయాన్ని పర్యాటక కేంద్రంగా మరింత అభివృద్ధి చేస్తాను. ద్రాక్షారామలో కంపోస్టు యార్డు సమస్యను పరిష్కరిస్తాను. పంట కాలువల్లో పూడిక తీయించి సాగునీరు అందిస్తాను. మార్గం లేని శ్మశానవాటికలు ఉన్న గ్రామాల్లో దారి ఏర్పాటు చేస్తాను.

ప్రజలకు అందుబాటులో ఉండేందుకు తీసుకునే చర్యలు?

రామచంద్రపురంలో శాశ్వతంగా నివాస గృహం నిర్మించుకుంటాను. ఇక్కడే ఉంటాను. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటాను.

మెజార్టీ వర్గాల ప్రజలకోసం ఏమి చేస్తారు?

వైసీపీ పాలనలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, కాపులు తీవ్రంగా నష్టపోయారు. కూటమి మేనిఫెస్టోలో వీరి అభున్నతికి పొందుపరచిన హామీలు సక్రమంగా అమలు జరిగేలా చూస్తాను.

కుటుంబ సభ్యుల తోడ్పాటు ఎలా ఉంది?

బాగుంది. ప్రచారానికి తక్కువ సమయం ఉండడంతో కుటుంబ సభ్యులంతా ప్రచారంలో పాల్గొంటున్నారు. నలుగురూ నాలుగు పక్కలా ప్రచారం చేస్తున్నారు.

- ద్రాక్షారామ

మోదీ వస్తున్నారు..



భారీ వేదిక నిర్మాణం

6న వేమగిరి హైవే వద్ద భారీ బహిరంగ సభ

కూటమి అభ్యర్థుల గెలుపు కోసం ప్రధాని రాక ● ట్రాఫిక్ మళ్లింపు

రాజమహేంద్రవరం, మే 3 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈనెల 6న రాజమహేంద్రవరం రానున్నారు. ఆయనతోపాటు టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, జనసేన అధినేత, పవర్‌స్టార్ పవన్‌కల్యాణ్ కూడా హాజరవుతున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి రాజమహేంద్రవరం ఎంపీ బరిలో ఉన్నారు. నర్సాపురం లోక్‌సభలో కూడా కూటమి తరపున బీజేపీ అభ్యర్థి వర్మ పోటీ చేస్తున్నారు. అనపర్తిలో నల్లమిల్లి రామకృష్ణారెడ్డి బీజేపీ అభ్యర్థిగా రంగంలో ఉన్నారు. వీరితో పాటు కూటమి అభ్యర్థుల గెలుపు కోసం ప్రజలకు పిలుపు ఇచ్చేందుకు ప్రధాన మోదీ వస్తున్నారు. తూర్పు గోదావరి, కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల పరిధిలో ఈ సభ విజయ శంఖారావం పేరిట ఇక్కడ జరగనుంది. గత మే నెలలో తెలుగు దేశం పార్టీ మహానాడు నిర్వహించిన వేమగిరిలో జాతీయ రహదారి పక్కన భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు చేస్తున్నారు. గోదావరి జిల్లాల నుంచి సుమారు 2 లక్షల మంది హాజరవుతున్నట్టు నేతలు చెబుతున్నారు.

కూటమి అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ..

రాజమహేంద్రవరం అర్బన్, మే 3: ఎన్డీయే కూటమి అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ ఈనెల 6వ తేదీన రాజమహేంద్రవరం సమీపంలోని వేమగిరిలో ప్రధాని నరేంద్ర మోదీ బహిరంగ సభ జరుగుతుందని ప్రోగ్రాం ఇన్‌చార్జి కోడూరు లక్ష్మీనారాయణ, కో-ఆర్డినేటర్ కాశీ విశ్వనాథరాజు వెల్లడించారు. శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ విజయ శంఖారావం పేరుతో ఆ రోజు మధ్యాహ్నం 3.30 గంటలకు వేమగిరి జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న స్థలంలో జరిగే బహిరంగ సభలో మోదీ ప్రసంగిస్తారని తెలిపారు. విలేకరుల సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, బొమ్ముల దత్తు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ మళ్లింపు చర్యలు

రాజమహేంద్రవరం, మే 3 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ ఈ నెల 6న రాజమహేంద్రవరం సమీపంలోని వేమగిరిలో బహిరంగ సభకు హాజరవుతున్న సందర్భంగా పోలీసులు ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టారు. 6న ఉదయం 6 గంటల నుంచే ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయని ఎస్పీ జగదీశ్ తెలిపారు. గుండుగొలను, తాడేపల్లిగూడెం నుంచి వచ్చే వాహనాలు నల్లజర్ల-దేవరపల్లి-గామన్ బ్రిడ్జి-దివాన్‌చెరువు మీదుగా విశాఖ వెళ్లాలన్నారు. జొన్నాడ నుంచి మండపేట, రామచంద్రాపురం, కాకినాడ మీదుగా వాహనాలు కత్తిపూడిలో జాతీయ రహదారికి చేరుకోవాలని తెలిపారు. అలాగే కత్తిపూడి నుంచి వచ్చే వాహనాలు పిఠాపురం, కాకినాడ, రామచంద్రాపురం గుండా జొన్నాడ చేరుకొని విజయవాడ వైపు వెళ్లాలన్నారు. జిల్లా పరిసర ప్రాంతాల నుంచి వేమగిరి మీదుగా రాకపోకలు సాగించే వాహనాలు ధవళేశ్వరం, ఐఎల్‌టీడీ జంక్షను, కోటిపల్లి బస్టాండ్.. కేశవరం, ద్వారపూడి, మండపేట, రామచంద్రాపురం మీదుగా కాకినాడ.. పెరవలి జంక్షన్, సమిశ్రగూడెం, విజ్జేశ్వరం, కొవ్వూరు, గామన్ బ్రిడ్జి.. రాజానగరం, ద్వారపూడి, మండపేట, ఆలమూరు, జొన్నాడ, రావులపాలెం.. దివాన్ చెరువు, గామన్ బ్రిడ్జి, కొవ్వూరు, విజ్జేశ్వరం, పెరవలి, రావులపాలెం గుండా ప్రయాణించాలని ఎస్పీ పేర్కొన్నారు. ప్రధాని మోదీ రాక సందర్భంగా ట్రాఫిక్ మళ్లింపును అనుసరించి వాహనాలు ప్రయాణించాలని, వాహనదారులు పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా అన్ని చర్యలూ తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు.

గోదావరిలో స్నానానికి దిగి ఇద్దరు యువకులు మృతి



కొత్తపేట, మే 3: వేసవి తాపంతో గోదావరిలో స్నానానికి దిగిన ఇద్దరు యువకులు మృత్యువాతపడ్డారు. కపిలేశ్వరపురం మండలం నారాయణ లంక గోదావరి పాయ వద్ద ఈ ఘటన జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం...కొత్తపేట మండలం వానపల్లి శివారు మాలకొండయ్య నగర్‌కు చెందిన కంఠంశెట్టి ప్రసన్నకుమార్ (25), యనమల సతీష్(23)తో పాటు మరో నలుగురు యువకులు కలిసి నారాయణలంక వద్ద గోదావరి స్నానానికి వెళ్లారు. కుమార్, సతీష్ గల్లంతు కాగా స్థానికులు గాలించి ఒడ్డుకు చేర్చారు. అప్పటికే వారు మృతిచెందారని స్థానికులు తెలిపారు. దీనిపై కొత్తపేట, కపిలేశ్వరపురం పోలీసులకు సమాచారం అందించినప్పటికీ సరిహద్దు సమస్య తలెత్తడంతో చర్యల్లో జాప్యం జరిగింది. దీంతో యువకుల మృతదేహాలను బంధువులు తీసుకెళ్లిపోయారు. ప్రసన్నకుమార్ టైల్స్ పనిచేస్తుంటాడు. సతీష్‌ది రాజోలు మండలం కేశనపల్లికి కాగా వానపల్లిలో అమ్మమ్మ ఇంటి వద్ద ఉండి ఇంజనీరింగ్ పూర్తి చేశాడు.

10న డెల్టా కాలువల మూసివేత

ధవళేశ్వరం, మే3: రబీకి నీటి విడుదల అనంతరం కాల్వల పరిధిలో మరమ్మత్తులు చేపట్టడానికి వీలుగా డెల్టా కాలువలను ఈ నెల 10 సాయంత్రం మూసివేయనున్నట్లు గోదావరి డెల్టా సిస్టమ్ చీఫ్ ఇంజనీర్ ఆర్.సతీష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లో తాగునీటి ఇబ్బంది లేకుండా చెరువులు ఈ లోపు నింపుకోవాలని ఆయన సూచించారు. సుమారు 50 రోజుల క్లోజర్ పీరియడ్‌లో కాల్వల పరిధిలో లాకులు, షెట్టర్ల మరమ్మత్తులతో పాటు పూడిక తీత పనులు చేపట్టనున్నారు. శుక్రవారం సాయంత్రం తూర్పు డెల్టాకు 100 క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 500 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 3350 క్యూసెక్కులు చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు.

జనసేన నేత నాగబాబు రోడ్‌షో



రోడ్‌షోలో మాట్లాడుతున్న నాగబాబు

పిఠాపురం రూరల్, మే 3: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ సహా తమందరి జీవితాలకు ఏదో సాధించాలని ఉందని, సంపాదించాలనే కోరికలు లేవని, కేవలం సేవ చేయాలనే తపన ఉందని జనసేన ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు తెలిపారు. పిఠాపురం మండలం బి.కొత్తూరు, జగపతిరాజపురం, పి.తిమ్మాపురం, పి.రాయవరం, రాపర్తి, భోగాపురం, బి.ప్రత్తిపాడు గ్రామాల్లో పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మతో కలిసి శుక్రవారం సాయంత్రం నుంచి రాత్రి వరకూ రోడ్‌షో నిర్వహించారు. అడుగడుగునా పూలవర్షం కురిపించారు. కేంద్రం, రాష్ట్రంలో ఏర్పడే కూటమి ప్రభుత్వాలు సహకారంతో ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేసే బాధ్యత పవన్ తీసుకుంటారని చెప్పారు. రాజశేఖర్‌రెడ్డి ముఖం చూసి గత ఎన్నికల్లో జగన్‌కు ఓటు వేశారని, ఈసారి మీ పిల్లలును చూసి జనసేన కూటమికి ఓటు వేయాలని కోరారు. పవన్ సినిమాలు ద్వారా వచ్చిన సంపాదనను ప్రజలకే ఖర్చు చేశారని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే వర్మ మాట్లాడుతూ వైసీపీ ఎన్ని కుట్రలకు పాల్పడినా పవన్ రికార్డు స్థాయి మెజార్టీతో పిఠాపురంలో విజయం సాధిస్తారని తెలిపారు. ఏ నాడు ప్రజలకు కనిపించని వంగా గీతను అత్తారింటికి పంపుదామని వ్యాఖ్యానించారు. ఎంపీ, ఎమ్మెల్యే ఓట్లను జనసేనకు వేయాలని విజ్ఞప్తి చేశారు. రోడ్‌షోలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ బుర్రా కృష్ణంరాజు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు అల్లుమల్లు విజయకుమార్, సకుమళ్ల గంగాధర్, బర్ల అప్పారావు పాల్గొన్నారు.

చైతన్య గోదావరి బ్యాంకు ద్వారా
రూ.12,500 కోట్ల రుణాలు



బ్యాంకు శాఖను ప్రారంభిస్తున్న దృశ్యం

గొల్లప్రోలు, మే 3: రాష్ట్రంలోని 8 జిల్లాల్లోని 268 శాఖల ద్వారా సేవలందిస్తున్న చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు 2024 మార్చి నెలాఖరు నాటికి రూ. 10,028 కోట్లు డిపాజిట్లు సేకరించి రూ.12,500 కోట్లు రుణాలుగా అందించినట్లు బ్యాంకు ఛైర్మన్ కె.ప్రమోద్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గొల్లప్రోలులోని బ్యాంకు శాఖ నూతన భవనాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో తమ బ్యాంకు పనిచేస్తున్నదని తెలిపారు. సీనియర్స్ సిటిజన్స్‌కు ప్రభుత్వరంగ బ్యాంకుల్లో తమ బ్యాంకు అధికంగా 8.60శాతం వడ్డీ చెల్లిస్తున్నదని చెప్పారు. రైతులు పంట పొలాలు కొనుగోలు చేసేందుకు రుణాలు అందిస్తున్నామని తెలిపారు. బీమా సౌకర్యంతో పాటు ఆరోగ్య బీమా సదుపాయం అందుబాటులో ఉందని చెప్పారు. రాజమహేంద్రవరం రీజియన్ పరిధిలో 65 శాఖలు ఉన్నాయని, మరో ఐదు శాఖలు ప్రారంభిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు రీజియన్ మేనేజరు డి.పాపయ్య, ప్రధాన కార్యాలయ ప్రణాళిక అధికారి ఆంజనేయులు, రామారెడ్డి, ప్రాంతీయ కార్యాలయ క్రెడిట్ అధికారి రత్నకుమార్, బ్రాంచి మేనేజరు జె.లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.

బదిలీలు నిషేధం

అమలాపురం టౌన్, మే 3: ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు బదిలీలు నిషేధమని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హిమాన్సు శుక్లా పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉంటుందన్నారు. ఎన్నికల విధుల్లో నియమితులైన అధికారులు... మంత్రుల సమావేశాలకు హాజరు కాకూడదన్నారు. ఓటరు ఎవరికి ఓటు వేశారో వారికి తప్ప వేరే ఎవరికీ తెలిసే అవకాశం లేకుండా వీవీ ప్యాట్లను ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో వీడియో కెమెరాలతో వెబ్ కాస్టింగ్ చిత్రీకరణ ఉంటుందన్నారు. ఈ నెల 13వ తేదీ ఉదయం 7 నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పోలింగ్ జరుగుతుందని కలెక్టర్ చెప్పారు.

వీఎస్ఎం కళాశాలలో పోస్టల్ బ్యాలెట్ కేంద్రం

రామచంద్రపురం (ద్రాక్షారామ), మే 3: పట్టణంలో వీఎస్ఎం డిగ్రీ కళాశాలను పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రంగా ఏర్పాటు చేసినట్టు రిటర్నింగ్ అధికారి సుధాసాగర్ తెలిపారు. ఓటు హక్కు ఉన్నవారు ఈ నెల 5, 6, 7 తేదీల్లో ఈ కేంద్రంలో పోస్టల్ బాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవచ్చన్నారు.





ఎంపీ అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే అభ్యర్థి ఆనందరావులను గజమాలతో సత్కరిస్తున్న నాయకులు, అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

చంద్రబాబును ముఖ్యమంత్రిని చేస్తేనే రాష్ట్రాభివృద్ధి

అమలాపురం అసెంబ్లీ కూటమి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు

అల్లవరం, మే 3: వైసీపీ అరాచక పాలనకు ఓటు ద్వారా బుద్ధిచెప్పి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేస్తేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని అమలాపురం అసెంబ్లీ కూటమి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు అన్నారు. మండలంలోని బోడసకుర్రు, అల్లవరం గ్రామాల్లో అమలాపురం లోక్‌సభ అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్, అసెంబ్లీ అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబురాజు శుక్రవారం కూటమి శ్రేణులతో కలిసి ప్రచారం నిర్వహించారు. మేనిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరించి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సంక్షేమ పథకాలు అమలు చేస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, తాగునీటి సౌకర్యం కల్పిస్తామన్నారు. అమలాపురం లోక్‌సభ కూటమి అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్ మాట్లాడుతూ వైసీపీ దోపిడీదారుల నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవలసిన బాధ్యత ప్రజలందరిపైనా ఉందన్నారు. అథోగతిపాలైన రాష్ట్రాన్ని చక్కదిద్దే శక్తి చంద్రబాబుకు మాత్రమే ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేదలకు గృహ నిర్మాణ రుణాలు అందించలేకపోయారని ఎద్దేవా చేశారు. జాబు కావాలంటే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. గ్రామంలో శ్మశానవాటిక, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పలుచోట్ల మహిళలు హారతులు ఇవ్వగా పూలదండలు, దుశ్శాలువాలతో సత్కరించారు. మెట్ల రమణబాబు, చిక్కాల గణేష్, చింతా శ్రీనివాసరావు, అడపా శ్రీనివాసరావు, అరవ చంటి, సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మినాగేశ్వరరావు, ఓలేటి పరమేశ్వరరావు, సుంకర సాయి, కంకిపాటి వీరబాబు, తోలేటి నానాజీ, పిల్లా ప్రసాద్, రాసూరి రాంబాబు, నార్గన శ్రీనివాస్, బి.పాండు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. కూటమి అభ్యర్థులను గెలిపించాలంటూ అగ్నికుల క్షత్రియ సాధికార కమిటీ జిల్లా కన్వీనర్ లంకే భీమారాజు, కొల్లు విష్ణుమూర్తి, కొపనాతి తాతాజీ, కోలా తాతరాజు, కొల్లు సూర్యనారాయణ రెబ్బనపల్లి, గోడితిప్ప, తుమ్మలపల్లి గ్రామాల్లోని మత్స్యకార ప్రాంతాల్లో ప్రచారం చేశారు. పలువురు టీడీపీలో చేరగా సాదరంగా ఆహ్వానించారు.

అమలాపురం రూరల్: అమలాపురం అసెంబ్లీ కూటమి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు విజయం కోరుతూ ఆయన భార్య అరుణ శుక్రవారం భట్నవిల్లిలో ప్రచారం నిర్వహించారు. నామాడి తారక్, మండలీక సుబ్రహ్మణ్యశర్మ, కటికదల పండు, కాట్రు శ్రీను ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. పెచ్చెటి విజయలక్ష్మి, అధికారి జయవెంకటలక్ష్మి, మంద గద్దయ్య, ఆవుపాటి వేణుగోపాల్ పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూమును పరిశీలిస్తున్న సాధారణ పరిశీలకుడు రాజేశ్వర్‌గోయల్

నిఘా నీడలో సార్వత్రిక ఎన్నికలు

అమలాపురం టౌన్, మే 3: సార్వత్రిక ఎన్నికల నిర్వహణ పూర్తిస్థాయి నిఘా నీడలో జరుగుతుందని అమలాపురం లోక్‌సభ, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల సాధారణ పరిశీలకులు రాజేశ్వర్ గోయల్, పరదీప్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం వారు కలెక్టరేట్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని పరిశీలించారు. ఎన్నికల సీజర్ మేనేజ్‌మెంట్ వ్యవస్థను పకడ్బందీగా అమలు చేయడంలో సమాచార, నిఘా ఆధారిత ఎన్‌ఫోర్స్‌మెంట్ కీలకమన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళికి సంబంధించి సీ-విజిల్ యాప్, ఎలక్షన్‌సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, కస్టమ్స్ తదితర విభాగాల కార్యకలాపాలను పరిశీలించారు. సీ-విజిల్ ద్వారా అందిన ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను రికార్డుల ఆధారంగా పరిశీలించారు. చెక్‌పోస్టుల వద్ద నిఘా అమలు తీరుపై ఆరా తీశారు. స్టాటస్టిక్ సర్వేలెన్స్ టీమ్‌లు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు క్షేత్రస్థాయిలో పరిశీలనకు సంబంధించి ఆయా వాహనాలకు అమర్చిన జీపీఎస్ పరికరాల ద్వారా ఎప్పటికప్పుడు కేంద్ర స్థానానికి సమాచారం అందుతుందన్నారు. నిఘా బృందాల కదలికను పరిశీలించే కంట్రోల్ రూమ్ నిర్వహణ తీరును పరిశీలించారు. వ్యయ పరిశీలకులు ఉమేష్ కుమార్, సుమిత్‌దాస్ గుప్తా, నోడల్ అధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రేపటి నుంచి పోస్టల్ బ్యాలెట్ పోలింగ్

కొత్తపేట అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి సత్యనారాయణ



కొత్తపేట, మే 3: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా కొత్తపేట నియోజకవర్గానికి సంబంధించి ఈ నెల 5, 6, 7 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ నిర్వహిస్తున్నట్టు కొత్తపేట ఆర్డీవో, రిటర్నింగ్ అధికారి జీవీవీ సత్యనారాయణ తెలిపారు. 1,534 పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ఉండగా అందులో 1,298 మంది నియోజకవర్గంలో పనిచేస్తున్న పోలింగ్ సిబ్బంది అని, 320 మంది ఇతరచోట్ల పని చేస్తున్నారన్నారు. ఇతర జిల్లాల్లో పనిచేస్తూ ఇక్కడ ఓటర్లుగా ఉన్న 323 మంది ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ఇచ్చామని, వారికి కూడా ఈ తేదీల్లోనే పోలింగ్ నిర్వహిస్తామన్నారు. 85 ఏళ్లు నిండిన వృద్ధులు నియోజకవర్గంలో 1,500 మంది ఉండగా 63 మంది మాత్రమే హోం ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకున్నారన్నారు. పీవో, ఏపీవో, ఓపీవోలకు మరోసారి ఎన్నికల విధులపై శిక్షణ ఇస్తామన్నారు. సమావేశంలో ఏఆర్వో ఎలీషా, ఎంపీడీవో కె.వాణి పాల్గొన్నారు.



తీవ్ర ఉష్ణోగ్రతలకు చెరువులో చచ్చిపోయిన చేపలు, ఎస్.కొత్తపల్లిలో చెరువులో చనిపోయిన చేపలను ఏరి గుట్టపోసిన దృశ్యం

ఉష్ణతాపానికి చనిపోతున్న చేపలు

ఉప్పలగుప్తం, మే 3: అధిక ఉష్ణోగ్రతలకు చెరువుల్లో నీరు సలసల కాగిపోతోంది. దీంతో చేపలు చచ్చి తేలిపోతున్నాయి. నెల నుంచీ చెరువులకు నీరు పెట్టుకునే అవకాశం లేకపోవడం, దానికితోడు మండుతున్న ఎండలు చేపలను చంపేస్తున్నాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు. కాల్వలు తెరిచే ఉన్నా నెల రోజులుగా నీరు పూర్తిస్థాయిలో ఇవ్వకపోవడంతో ఎస్.కొత్తపల్లి, చల్లపల్లి, ఎస్.యానాం గ్రామాల్లో వందల చెరువుల్లో చేపలు చనిపోవడంతో రైతులు విపరీతంగా నష్టాలను చవిచూస్తున్నారు. చేపల చెరువులకు పూర్తిస్థాయిలో నీరందించాలని, కాల్వల మూసివేత తేదీని పొడిగించాలని చెరువుల యజమానులు ఇరిగేషన్ అధికారులను కోరుతున్నారు.



కొత్తపేటలో న్యాయవాదులను ఓట్లు అభ్యర్థిస్తున్న అయ్యాజీ వేమా

న్యాయవాదులు కూటమికి మద్దతు ఇవ్వాలి: వేమా

కొత్తపేట, మే 3: మండలంలోని వాడపాలెంలో న్యాయవాదులతో మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీ వేమా శుక్రవారం సమావేశమయ్యారు. కొత్తపేట అసెంబ్లీ కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావు, అమలాపురం లోక్‌సభ అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్‌లకు ఓట్లేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం, చీకురమిల్లి శ్రీనివాసరావు, పి.సత్తిబాబు, పప్పుల దొరబాబు, అల్లు భాస్కర్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ విజేత యానాం జట్టు

యానా, మే 3: పుదుచ్చేరి విద్యా శాఖ ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు జరిగిన రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ చాంపియన్‌షిప్‌లో యానాం క్రీడాకారులు ప్రతిభ సాధిస్తున్నారని ఆర్గనైజింగ్ సెక్రటరీ పాము సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం జరిగిన బాస్కెట్‌బాల్ పోటీల్లో జోన్-1పై జోన్-8 (యానాం) జట్టు 31-48 స్కోరుతో ఫైనల్‌కు చేరింది. జోన్-2పై జోన్-8 (యానాం)జట్టు 42-48 స్కోరుతో ప్రథమ స్థానంలో నిలిచింది. వ్యాయమ ఉపాధ్యాయలుగా నక్కల సుబ్బన్న, కొప్పనాతి భాస్కర్, ఐవీకే మోహన్, వి.సన్యాసిరావు. జె.చంద్రశేఖర్, వి.వరప్రసాద్, ఎస్.విష్ణుమూర్తి, సీహెచ్ వెంకటేశ్వరరావు వ్యవహరిస్తున్నారు. విద్యార్థులను యానాం విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణప్రవీణ్ అభినందించారు.

రేపు ‘నీట్’ ప్రవేశ పరీక్ష

యానాం నవోదయ విద్యాలయ కేంద్రంగా కేటాయింపు

యానాం, మే 3: నీట్ ప్రవేశ పరీక్షకు యానాం జవహర్ నవోదయ విద్యాలయాన్ని కేంద్రంగా కేటాయించినట్టు ప్రిన్సిపాల్, కో-ఆర్డినేటర్ టీవీఎస్ ప్రకాశరావు తెలిపారు. యానాంలో 123 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు మాత్రమే విద్యార్థులను అనుమతిస్తామన్నారు. అనంతరం ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించేది లేదన్నారు. మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం 5.20 గంటల వరకు పరీక్ష జరుగుతుంది. విద్యార్థులు అడ్మిట్ కార్డుతో పాటు రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ప్రభుత్వ గుర్తింపు పొందిన ఫొటోతో కూడిన ఐడెంటిటీ కార్డు తీసుకురావాలన్నారు. డ్రెస్ కోడ్ నిబంధనలకు అనుగుణంగా ఉండాలన్నారు.

మండల సర్వసభ్య సమావేశం

పి.గన్నవరం, మే 3: పి.గన్నవరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మీ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో మండలంలో నెలకొన్న సమస్యలపై శాఖలు వారీగా చర్చ జరపకుండానే సభ్యుల కోరం లేకపోవడంతో సమావేశాన్ని ముగించారు. ఎంపీడీవో సీహెచ్ త్రిశూలపాణి, అసిస్టెంట్ సీడీపీవో జయలక్ష్మి, వైస్ ఎంపీపీ చెల్లిబోయిన గంగాదేవి, మండల ఎంపీటీసీల సమ్మైఖ్య అధ్యక్షులు అదిమూలం సూరయ్యకాపు, బండి మహలక్ష్మీ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం కోసం ప్రజల ఎదురుచూపులు




ఆలమూరు: మడికిలో ఎన్నికల ప్రచారంలో బండారు సత్యానందరావు, జొన్నాడలో బండారుకు బొట్టుపెడుతున్న మహిళ



రావులపాలెంలో టీడీపీలో చేరిన మాజీ ఎంపీటీసీ ఇళ్ల రాజేష్‌ను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న బండారు సత్యానందరావు

ఆలమూరు, మే 3: కూటమి ప్రభుత్వం రాక కోసం పేదల నుంచి అన్ని వర్గాల ప్రజలు ఎదురుచూస్తున్నారని కొత్తపేట అసెంబ్లీ కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావు అన్నారు. మండలంలోని మడికి, జొన్నాడ, మూలస్థానం అగ్రహారం గ్రామాల్లో శుక్రవారం ఆయన ప్రచారం చేశారు. మండుటెండలోనూ మహిళలు పూలవాన కురిపిస్తూ హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. సత్యానందరావు మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచకం రాజ్యమేలుతోందని, వైసీపీ ప్రభుత్వానికి స్వస్తి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ప్రజలు విశ్వసిస్తున్నారన్నారు. కూటమి మేనిఫెస్టోలో పేర్కొన్న పథకాలకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందన్నారు. మేనిఫెస్టోలోని పథకాలను అర్హులందరికీ అందిస్తామన్నారు. 50ఏళ్లు దాటిన బీసీలకు రూ.4వేలు పింఛన్ అందిస్తామన్నారు. మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణం, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు, ప్రతీ రైతుకు నెలకు రూ.20వేలు అందిస్తామన్నారు. ఈఎన్నికల్లో కూటమి గెలుపు- వైసీపీ ఓటమి తథ్యమని జనసేన ఇన్‌చార్జి బండారు శ్రీనివాసరావు అన్నారు. మోటారు సైకిళ్లపై భారీ ర్యాలీ నిర్వహించారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక

రావులపాలెం, మే3: రావులపాలెం మాజీ ఎంపీటీసీ ఇళ్ల రాజేష్, చోడే సత్యనారాయణ శుక్రవారం వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. వీరికి కొత్తపేట కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావు పార్టీ కండు వాలు వేసి ఆహ్వానించారు.

బండారు తనయుడు సంజీవ్ ప్రచారం

ఆత్రేయపురం, మే 3: కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావు తనయుడు సంజీవ్ శుక్రవారం ర్యాలి గ్రామంలో టీడీపీ ముఖ్యనేతలతో కలిసి ఇంటింటికీ వెళ్లి మేనిఫెస్టోలోని పథకాలను ఓటర్లకు వివరించారు. తన తండ్రిని ఎమ్మెల్యేగా, గంటి హరీష్‌మాధుర్‌ను ఎంపీగా గెలిపించాలన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

ఆత్రేయపురం, మే 3: మెర్లపాలేనికి చెందిన కాసాని సూరిబాబు (44) మద్యానికి బానిసయ్యాడు. ఆరోగ్యం క్షీణించడంతో జీవితంపై విరక్తి చెంది గురువారం సాయంత్రం పురుగుల మందు తాగాడు. అతడిని సోదరుడు శివ ఆటోలో కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. శివ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

మత్స్యకారుల అభ్యున్నతికి పాటుపడతా

ఐ.పోలవరం, మే 3: తీరప్రాంత గ్రామాల్లో జీవనం సాగిస్తున్న మత్స్యకారుల అభ్యున్నతికి పాటుపడతానని ముమ్మిడివరం అసెంబ్లీ కూటమి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు అన్నారు. భైరవపాలెంలో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజలను కలిపి తనను, పార్లమెంటు కూటమి అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్‌ను గెలిపించాలని కోరారు. అనంతరం టి.కొత్తపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తన హయాంలోనే తప్ప ఐదేళ్లలో గ్రామంలో ఒక్క అభివృద్ధి పని జరగలేదన్నారు. కూటమిని గెలిపించాలని కోరారు.

నదీ తీర ప్రాంతాల్లో సమస్యల పరిష్కారానికి కృషి




తొండవరంలో మహిళకు మేనిఫెస్టో కరపత్రం అందిస్తున్న గిడ్డి సత్యనారాయణ, మాచవరంలో జనసేన పార్టీలోకి చేరుతున్న దృశ్యం



వాకలగరువులో కూటమి నేతలను సత్కరిస్తున్న నాయకులు

పి.గన్నవరం కూటమి అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ

అంబాజీపేట, మే 3: వరదల కారణంగా నదీ తీర ప్రాంతాల్లో ఏర్పడుతున్న సమస్యలను కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పరిష్కరిస్తానని పి.గన్నవరం అసెంబ్లీ కూటమి అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ అన్నారు. వాకలగరువు, తొండవరం, నందంపూడి గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కూటమి పార్టీ శ్రేణులు భారీ మోటార్‌సైకిల్ ర్యాలీతో బ్రహ్మరథం పట్టారు. నదీ తీర గ్రామాల్లో రహదారులు, కాజ్‌వే నిర్మాణాలు చేపడతానన్నారు. నియోజకవర్గంలో రహదారులు, డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరుస్తానన్నారు.కూటమి ప్రభుత్వంతోనే అన్నివర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. తొండవరం, నందంపూడి గ్రామాల్లో లోక్‌సభ అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్‌తో కలిసి గిడ్డి సత్యనారాయణ ప్రచారం చేశారు. జనసేన గుర్తు గాజుగ్లాసు, టీడీపీ గుర్తు సైకిల్‌పై ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. మాచవరంలో మెట్లకాలనీలో జనసేన పార్టీ మండలాధ్యక్షుడు దొమ్మేటి సాయికృష్ణ ఆధ్వర్యంలో పలువురు జనసేన పార్టీలో చేరారు. వారందరికి గిడ్డి సత్యనారాయణ కండువా లుకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకులు నామన రాంబాబు, డొక్కా నాథ్‌బాబు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ళ దొరబాబు, సర్పంచ్‌లు మద్దింశెట్టి దొరబాబు, పేరాబత్తుల దొరబాబు, జల్లి బాలరాజు, ఎంపీటీసీలు వాకపల్లి దొరబాబు, వడ్లమాని పద్మావతి, కూటమి నాయకులు దాసరి వీరవెంకట సత్యనారాయణ, గణపతి వీరరాఘవులు, శిరిగినీడి వెంకటేశ్వరరావు, సుంకర బాలాజీ, చిన్నం బాలవిజయరావు, నాగాబత్తుల వెంకటసుబ్బారావు, దంతులూరి శ్రీనురాజు, వాసంశెట్టి వరలక్ష్మిచినబాబు, అరిగెల బలరామమూర్తి, గుడాల ఫణి, క్రాప నాగభూషణం, కొల్లి సూర్యారావు, పితాని కేశవరావు, మైపాల తాతాజీ, ఉందుర్తి వెంకటేశ్వరరావు, పేరాబత్తుల రాజు, పితాని రామకృష్ణ, పెదపూడి శ్రీనివాసరావు, యేడిద నాగబాబు, కేతా అర్జునుడు, పెచ్చెట్టి దుర్గాప్రసాద్, నేదునూరి కళ్యాణ్, దువ్వూరి సురేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ తోటకు ఓటమి భయం పట్టుకుంది



మండపేట కూటమి అభ్యర్థి వేగుళ్ల జోగేశ్వరరావు

మండపేట, మే 3: ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు రాజకీయ వ్యభిచారని కూటమి అభ్యర్థి వేగుళ్ల జోగేశ్వరరావు ఆరోపించారు. తోటకు దమ్ముంటే ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి ఎన్నికల్లో పోటీ చేయాలని ఆయన సవాల్ విసిరారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 30ఏళ్లపాటు శత్రువులుగా ఉన్న ఎంపీ బోస్, ఎమ్మెల్సీ తోట ఇప్పుడు ఎందుకు కలిసారో ప్రజలకు సమాధానం చెప్పాలని వేగుళ్ల డిమాండ్ చేశారు. గతంలో జడ్పీ సమావేశంలో బోస్‌పై తోట చేసిన అనుచిత వ్యాఖ్యలను అడ్డుకున్నది తాను, నిమ్మకాయల చినరాజప్ప అన్న విషయాన్ని వేగుళ్ల గుర్తుచేశారు. బోస్‌కు సంబంధించిన మద్యం దుకాణంపై రాళ్లతో తోట చేయించిన దాడి అక్కడి ప్రజలు మరిచిపోలేదన్నారు. ఇవన్నీ వదిలేసి ఇప్పుడు ఇద్దరూ ఎలా ఒక్కటై తిరుగుతారని ప్రశ్నించారు. సర్వేలో తోట ఓటమి ఖాయమని తేలడంతో అందుకు తోట భయపడి ఇక్కడ కుల రాజకీయాలుకు పాల్పడుతున్నారన్నారు. రామచంద్రపురంలో వైసీపీ అభ్యర్థి ప్రకాష్ నామినేషన్ సమయంలో గెలిచినా, ఓడినా రామచంద్ర పురంలోనే ఉంటామని తోట చేసిన వ్యాఖ్యలు ఆయన దిగజారుడు తనానికి అర్థం పడతాయన్నారు. మండపేట నియోజకవర్గంలో టీడీపీ ప్రభుత్వంలో రూ.96కోట్లతో మంజూరైన వాటర్ గ్రిడ్ పథకాన్ని వైసీపీ ప్రభుత్వం నిలుపల చేసిందని వేగుళ్ల ధ్వజమెత్తారు. మెర్నిపాడులో ఎన్నికల ప్రచార సమయంలో వైసీపీ ప్రచార ఆటో తమ ప్రచారానికి అడ్డుగా పెడితే పక్కకు తీయమన్న సంఘటనను కూడా తోట రాజకీయంగా వాడుకోవటం ఆయన దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు. మండపేటలో నాల్గవసారి కూడా కూటమి అభ్యర్థిగా తన గెలుపు తథ్యమని వేగుళ్ల చెప్పారు.

రాష్ట్ర ఉజ్వల భవిష్యత్‌కు కూటమిని గెలిపించండి





కేదార్లంకలో ప్రచారరథం నుంచి వేగుళ్ల జోగేశ్వరరావు ప్రచారం, కేదార్లంకలో వేగుళ్లకు సమస్యలు వివరిస్తున్న గ్రామస్తులు, మండపేటలో వేగుళ్లకు మద్దతుగా కుమార్తె ప్రచారం




కపిలేశ్వరపురం: కేదార్లంకలో బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న యువత, మండపేటలో వేగుళ్లకు మద్దతుగా వేగుళ్ల కుటుంబ సభ్యుల ప్రచారం

కపిలేశ్వరపురం, మే 3: కూటమి మేనిఫెస్టోతోనే రాష్ట్రాభివృద్ధితో పాటు అన్ని రంగాలు అభివృద్ధి చెందుతాయని మండపేట నియోజకవర్గ కూటమి అభ్యర్థి, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. శుక్రవారం కేదార్లంకలో జనసేన పార్టీ మండపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ వేగుళ్ళ లీలాకృష్ణతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైసీపీ ఐదేళ్ళ పాలనలో రాష్ట్రం అవినీతిమయంగా మారిందని, అప్పుల ఊబిలో కూరుకుపోయిందన్నారు. రాష్ట్ర ఉజ్వల భవిష్యత్‌కు కూటమిని గెలిపించాలని కోరారు. లంకగ్రామాల అభివృద్ధి గత టీడీపీ పాలనలో మాత్రమే జరిగిందన్నారు. ఎమ్మెల్సీ తోట అండతో పెరుగులంకలో ఇసుక, మట్టి తవ్వకాలు విచ్చలవిడిగా జరిపి కొల్లగొట్టుకుపోయారన్నారు. దీనివల్ల వరదల సమయంలో గ్రామాలు ముంపుబారిన పడి కొట్టుకుపోయే ప్రమాదం ఉం దన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే లంకగ్రామాల సమస్యలన్నింటిని పరిష్కరిస్తామన్నారు. జగన్‌పాలనలో పేద, మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. వ్యవస్థలన్ని నాశనమయ్యాయన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబు మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని, డ్వాక్రా సంఘాలను స్థాపించి మహిళలను మహాశక్తిగా తీర్చిదిద్దారన్నారు. కూటమి ప్రభుత్వంరాగానే ప్రతీ రైతుకు ఏడాదికి రూ.20వేలు, 50ఏళ్లు దాటిన బీసీలకు రూ.4వేలు పెన్షన్, ప్రతీ మహిళకు నెలకు రూ.1500, ఆర్టీసీలో ఉచిత ప్రయాణం అందిస్తామన్నారు. కూటమి విడుదల చేసిన మేనిఫెస్టోలోని పథకాలను ప్రజలకు వివరించారు. ఈనెల13న జరిగే ఎన్నికల్లో మండపేట అసెంబ్లీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, అమలాపురం పార్లమెంటు కూటమి అభ్యర్థిగా గంటి హరీష్‌మాధుర్‌ను సైకిల్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరారు. గ్రామంలో ఆయనకు మహిళలు హారతులిచ్చి ఆశీర్వదించారు. ఎమ్మెల్యే వెంట ఉత్సాహంగా యువత, గ్రామస్థులు బైక్‌ర్యాలీ నిర్వహించారు. టీడీపీ, జనసేన, బీజేపి కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కుటుంబసభ్యుల ఎన్నికల ప్రచారం

మండపేట, మే 3: కూటమి అభ్యర్థి వేగుళ్ల జోగేశ్వరరావు విజయం కోరుతూ మండపేట పట్టణం, ఏడిదసావరంలో శుక్రవారం వేగుళ్ల కుమార్తెలు మణిమంజరి, సాయిసుమన ఎన్నికల ప్రచారం చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం ద్వారానే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, కూటమి అభ్యర్థులను గెలిపించి రాష్ట్రంలో విధ్వంసకర పాలనకు చరమగీతం పాడాలన్నారు. ప్రజల కోసంపనిచేసే తమ తండ్రి వేగుళ్లకు ఓటేసి గెలిపించాలని ఓటర్లను వారు కోరారు. వేగుళ్ల అల్లుడు వి.సాయికుమార్‌బాబు, తమ్ముడు కుమారుడు వేగుళ్ల అజయ్‌బాబు, వల్లూరి రామన్నచౌదరి, మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్ స్థానిక నేతలతో కలిసి వార్డుల్లో ఎన్నికలు ప్రచారం చేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధి చేసే వేగుళ్లను గెలిపించాలని ప్రజలను కోరారు. వారి వెంట స్థానిక నేతలు తదితరులు ఉన్నారు.

మండపేట కూటమి అభ్యర్థి వేగుళ్ల జోగేశ్వరరావు

కూటమితోనే రాష్ట్రాభివృద్ధి తథ్యం: సుభాష్





సుభాష్ హారతులు ఇస్తున్న మహిళలు, సుభాష్‌ను గజమాలతో సత్కరిస్తున్న దృశ్యం, సుభాష్,హరీష్‌లకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న చిక్కాల రామచంద్రరావు




చిన్నారిని ఎత్తుకున్న కూటమి అభ్యర్థి సుభాష్, రామచంద్రపురం 4వ వార్డులో లక్ష్మీ సునీత ఎన్నికల ప్రచారం

కాజులూరు, మే 3: రామచంద్రపురం నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ అసెంబ్లీ అభ్యర్థి వాసంశెట్టి సుభాష్, అమలాపురం ఎంపీ అభ్యర్థి గంటి హరీష్ మాధుర్‌ల విజయం తథ్యమని మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు అన్నారు. కాజులూరు మండలం కోలంక గ్రామంలో శుక్రవారం సుభాష్, హరీష్‌మాధుర్‌లకు మద్దతుగా చిక్కాల ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా కోలంక గ్రామవీధుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. యువకులు, విద్యావంతులు అయిన సుభాష్, హరీష్‌లను భారీ మెజార్టీతో గెలిపించాలని చిక్కాల ప్రజలను కోరారు.

టీడీపీ, జనసేన, బీజేపీ కూటమితోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని రామచంద్రపురం కూటమి అసెంబ్లీ అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రం 50ఏళ్ళు వెనక్కి వెళ్లిందని, వృత్తి, వ్యాపారులతో పాటు విద్యార్థులు, నిరుద్యోగులు సైతం అభివృద్ధికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మంచి విజనరీ ఉన్న నాయకులు చంద్రబాబు, పవన్‌కల్యాణ్, మోదీల ఐక్యతతో రాష్ట్రంలో ఎన్నో ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని ధీమా వ్యక్తం చేశారు. వైసీపీకి చెందిన, 20వ వార్డు కౌన్సిలర్ కొండేపూడి సూర్యకుమారి, ఆమె భర్త కొండేపూడి సురేష్‌లు సుభాష్ సమక్షంలో టీడీపీలో చేరారు.

బాలయోగి ఆశయ సాధనకు కృషి చేస్తాం: హరీష్

దివంగత లోక్‌సభ మాజీ స్పీకర్ జీఎంసీ బాలయోగి ఆశయ సాధనకు కృషి చేస్తానని ఆయన తనయుడు గంటి హరీష్‌మాధుర్ పేర్కొన్నారు. కోలంకలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దళితులంతా కూటమివైపు ఉన్నారని, భారీవిజయంతో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడుతుందని హరీష్ ధీమా వ్యక్తం చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు పేపకాయల బాబ్జి, జనసేన అధ్యక్షులు బొండా వెంకన్న, డేగల సతీష్, గంధం పళ్ళంరాజు, మాజీ ఎంపీపీ యాళ్ళ కృష్ణారావు, టీడీపీ నాయకులు టేకుమూడి సత్యనారాయణ, గుబ్బల ఏసురాజు, వనుం వీరభద్రంపాల్గొన్నారు.

సంపదను దోచుకుంటున్న వైసీపీకి గుణపాఠం చెప్పాలి





కొత్తలంకలో ప్రచార కార్యక్రమంలో దాట్ల బుచ్చిబాబు, కొత్తలంకలో గజమాలతో స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు, టీడీపీలో చేరిన భైరవపాలేనికి చెందిన మత్స్యకార యువకులు

ముమ్మిడివరం కూటమి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు




కర్రివానిరేవులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న దాట్ల బుచ్చిబాబు,బూరిగిపేటలో యువకులతో మాట్లాడుతున్న బుచ్చిబాబు

ముమ్మిడివరం, మే 3: ప్రజలకు సంక్షేమ పథకాలను ఎరగా పెట్టి కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని దోచుకుంటున్న ముఖ్యమంత్రి జగన్‌కు రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు పేర్కొన్నారు. కొత్తలంక, కర్రివానిరేవు, బూరుగుపేట గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. తొలుత అర్ధాని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బూరుగపేటలో కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకుని ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. గ్రామస్తులు గజమాల, మంగళ హారతులతో స్వాగతం పలికారు. ఈసందర్భంగా దాట్ల బుచ్చిబాబు మాట్లాడుతూ రాష్ట్రం అన్ని రంగాల్లోను అభివృద్ధి సాధించాలంటే చంద్రబాబుతోనే సాధ్యమవుతుందన్నారు. యువతకి ఉపాధి, ఉద్యోగాల కల్పన, సంపద సృష్టించడం విజన్ ఉన్న చంద్రబాబుతోనే సాధ్యమవుతుందన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో యువతకు ఉపాధి కరువై రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి అధోగతి పాలు చేశారన్నారు. సూపర్-6 పథకాలకు ప్రజలకు వివరించి సైకిల్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. గతంలో గ్రామంలో ఆయన హయాంలో జరిగిన అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, గుత్తుల సాయి, గొలకోటి దొరబాబు, తాడి నరసింహారావు, పొద్దోకు నారాయణరావు, దొమ్మేటి రమణకుమార్, నడిమింటి సూర్యప్రభాకరం, దాట్ల బాబు, వీసాల చంద్రరావు, వీపూరి సత్యనారాయణరాజు, గుద్దటి జమి, గేదెల స్వామినాయుడు, గేదెల రఘునాథబాబా, వంగా బాబులు, వేగిరౌతు రాజబాబు, తోలేటి రాంబాబు, వీపూరి నాగరాజువర్మ, సానబోయిన మల్లికార్జునరావు, అయినవిల్లి వలీబాబా, దంగేటి శ్రీను, నడింపల్లి శ్రీనురాజు, గొల్లపల్లి గోపి, పొత్తూరి విజయభాస్కరవర్మ, రంకిరెడ్డి రాంబాబు పాల్గొన్నారు.

టీడీపీలో పలువురు చేరిక

ముమ్మిడివరం నగర పంచాయతీ 16వ వార్డు బొక్కావారి కిపాలేనికి చెందిన శెట్టిబలిజ, కృష్ణబలిజ, నాయీబ్రాహ్మణ సామాజికవర్గాలకు చెందిన మామిడిశెట్టి రమణ, కొప్పిశెట్టి బాబ్జి, కొప్పిశెట్టి బాలు, బొక్కా బాలయోగీశ్వరరావు, బొక్కా భానుకుమార్, భైరవపు లోరాజు, దంగేటి నవీన్, గునుపూడి శ్రీను, జక్కంశెట్టి ధనరాజుతో పాటు పలువురు టీడీపీలో చేరారు. వారికి కూటమి అభ్యర్థి దాట్ల సుబ్బరాజు కండువా కప్పి ఆహ్వానించారు. కొత్తలంకలో కాట్రేనికోన మండలం భైరవపాలేనికి చెందిన మత్స్యకార యువకులు ఓలేటి బాబి, రేకాడి రాజు, కర్రి గణేష్, కర్రి ప్రేమానందం ఆధ్వర్యంలో వంద మంది కూటమిలో చేరగా వారికి కండువా కప్పి బుచ్చిబాబు ఆహ్వానించారు. అలాగే బలుసుతిప్ప నుంచి కూడా కొంత మంది టీడీపీలో చేరగా కండువా కప్పి ఆహ్వానించారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన

ఐ.పోలవరం, మే 3: గుత్తెనదీవి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద శుక్రవారం స్థానికులు ఆందోళన చేశారు. ఇక్కడ రూ2.90కోట్లతో 33కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మించి ఆరు నెలల క్రితం ప్రారంభించారు. సబ్‌స్టేషన్‌ను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురాకుండా ఇక్కడి 5ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి 3.15 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటుచేసే ప్రయత్నం చేస్తుండగా స్థానికులు అడ్డుకున్నారు.

రామేశ్వరం శివాలయం ప్రధానార్చకుడు శర్మ మృతి

అల్లవరం, మే 3: ఎస్.రామేశ్వరం శివాలయం ప్రధానార్చకుడు పుల్లేటికుర్తి పురుషోత్తమశర్మ(61) గురువారం రాత్రి మృతి చెందారు. అస్వస్థతకు గురైన ఆయన్ను ఆసుపత్రికి తీసుకుని వెళ్తుండగా మార్గమధ్యంలో కన్నుమూశారు. శర్మకు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయన మృతికి ఆలయ చైర్మన్ అంగాని రామారావు, సర్పంచ్ సుందరనీడి సాయికృష్ణ సంతాపం తెలిపారు.

సీనియర్ నాయకుడు డేవిడ్ మృతి

ఆలమూరు, మే 3: ఆలమూరుకు చెందిన సీనియర్ రాజకీయ నాయకుడు తాళ్ల డేవిడ్ (68) శుక్రవారం మృతి చెందారు. మాజీ మంత్రి సంగిత వెంకటరెడ్డి శిష్యునిగా గుర్తింపు పొందిన ఆయన కాంగ్రెస్, జనసేన, వైసీపీల్లో పలు పదవులు చేపట్టారు. అస్వస్థతకు గురైన డేవిడ్‌ను రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించగా గుండెపోటుతో మృతి చెందినట్టు బంధువులు తెలిపారు. ఆయన మృతికి పలువురు నాయకులు సంతాపం తెలిపారు.

వైసీపీ నుంచి జనసేనలో చేరిక

అంతర్వేది, మే 3: పలు గ్రామాల నుంచి అగ్నికుల క్షత్రియ సామాజికవర్గానికి చెందిన వైసీపీ నాయకులు బర్రే నరసింహవర్మ(సామోరు), మైలా మూలాస్వామి, కొల్లు రమేష్, కొల్లు తరుణ్, రేకాడి రాజు, పొన్నమండ గండుముత్యాల రాజు, కర్రే ఆంజనేయులు, కొల్లాటి నాగేశ్వరరావు, పొన్నమండ వెంకటేశ్వర్లు జనసేన పార్టీ నాయకుడు రావూరి నాగు ఆధ్వర్యంలో శుక్రవారం జనసేనలో చేరారు.

సౌకర్యాలను పునరుద్ధరించాలి

మలికిపురం, మే 3: ఉపాధి కూలీలకు వేసవి అలవెన్సును పునరుద్ధరించాలని ఉపాధి కూలీ సంఘం ప్రభుత్వాన్ని డిమాండు చేసింది. కేశనపల్లిలో ఉపాధి కూలీలతో జిల్లా అధ్యక్షుడు ముత్యాల శ్రీనివాసరావు మాట్లాడారు.

ఫీల్డు అసిస్టెంట్‌పై ఫిర్యాదు

ముమ్మిడివరం, మే 3: కొత్తలంకలో ఎన్ఆర్జీఎస్ ఫీల్డు అసిస్టెంట్ గుత్తుల వెంకటరమణ వైసీపీ ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటున్నట్టు ఆ గ్రామానికి చెందిన కొందరు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో గ్రామానికి చెందిన మోకా రాంజీ భీమ్‌రావు, వీసాల చంద్రరావు, దాసరి గంగాధరరావు, నాగరాజు, బొక్కా త్రినాథ్, విత్తనాల భైరవస్వామి, సబ్బితి బాలాజీ ఉన్నారు.